# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

18.01.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 192 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను


జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



9119949944

7897222788 - 7897222789

## జేఈఈ పరీక్షల అడ్మిట్ కార్డుల విడుదల

2

# అతివలకే అవకాశం

- 50శాతం పదవులు మహిళలకే..
- మేయర్లు, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు
- రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం






## జనవరి 28 నుండి మహా జాతర

- కాకతీయ రాజుతో పోరాడి నేలకొరిగిన కోయరాజులు
- నాటి నుంచే మేడారం జాతరకు శ్రీకారం

2



## అర్వపల్లి వద్ద ఘోరం

- కారు పల్టీలు కొట్టడంతో ఇద్దరు టీచర్ల మృతి
- మరో ముగ్గురు టీచర్లకు తీవ్ర గాయాలు

2

## తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

- సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేలా చర్యలు
- సికింద్రాబాద్‌పై పోరాటం ఆపేది లేదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత కేటీఆర్

3



హైదరాబాద్, సికింద్రాబాద్‌కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు.

## ఇక సంగారెడ్డి నుంచి పోటీ చేయ్!

రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి అవమానించావేమో అని ఫీల్ అయ్యా

కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

3



## బీహార్ తర్వాత ఇప్పుడు బెంగాల్ వంతు



- బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటుదారులకు తృణమూల్ అండ
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- మాల్దా సభలో ప్రధాని మోడీ


4



## పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్

మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

## భారీగా ఐపీఎస్‌ల బదిలీ




విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి

2



# పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు

పాలమూరు అన్యాయం చేసిన కేసీఆర్

బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం

పదేళ్లు ప్రాజెక్టులు కట్టకుండా నిర్లక్ష్యం

- రూ.1,284 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సీఎం రేవంత్

**మహబూబ్‌నగర్, జనవరి 17:** దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ దాగి ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. వారి చెమట అందులో ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్ధండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క

మిగతా 2 లో



## నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సీఎం పర్యటన

- సీపీఐ సభలో పాల్గొననున్న రేవంత్
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- మేడారంలో ఆలయం ప్రారంభించనున్న సీఎం
- అక్కడే కేబినేట్ భేటీకి ఏర్పాట్లు పూర్తి

2



## గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హైఅలర్ట్

- ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం

2

## ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

- భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు
- రెండు విమానాల్లో పలువురి రాక

4




ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే.

4

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 18 జనవరి 2026




# అతివలకే అవకాశం

## 50శాతం పదవులు మహిళలకే..

## మేయర్లు, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లు ఖరారు

## రాష్ట్రంలో మున్సిపల్‌ఎన్నికలకు సర్వం సిద్ధం

**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదాఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3(ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. 121 మున్సిపాలిటీల్లో ఎస్సీ-17, ఎస్టీ-5, బీసీ-38, జనరల్-61 కేటాయించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ - ఎస్టీ (జనరల్),రామగుండం కార్పొరేషన్- ఎస్సీ (జనరల్),మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్- బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ - బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్- మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్- మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్- జనరల్, జీహెచ్‌ఎంసీ - మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్- మహిళ (జనరల్) కు కేటాయించారు.

# భారీగా ఐపీఎస్‌లు బదిలీ

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి

**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. మున్సిపల్ షెడ్యూల్ విడుదలకు ముందే అధికారుల బదిలీ జరగడం విశేషం. ఈ క్రమంలో 20మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి నియమితులయ్యారు. లాజిస్టిక్స్ ఎడిగా గజారావు భూపాల్, ఇంటెలిజెన్స్ డిఐజిగా ఆర్.భాస్కరన్, ఫ్యూచర్ సిటీ అడిషనల్ సీపీగా చందన దీప్తి, సైబరాబాద్ డిసిపిగా టి.అన్నపూర్ణ, ట్రాఫిక్-3 డిసిపిగా రాహుల్ హెగ్డే బదిలీ అయ్యారు. అలాగే అఎఆ ఎస్పీగా ఆర్.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ క్రైమ్ డిసిపిగా ఎస్.చైతన్యకుమార్, ట్రాఫిక్-1 డిసిపిగా అవినాష్ కుమార్, ట్రాఫిక్-2 డిసిపిగా కాజల్, సైబరాబాద్ కమిషనరేట్ డిసిపిగా శేషాద్రిని రెడ్డి, మల్కాజ్‌గిరి కమిషనరేట్ డిసిపిగా రాహుల్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డిసిపిగా శివం ఉపాధ్యాయ, మల్కాజ్‌గిరి ట్రాఫిక్-2 డిసిపిగా వి.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

# గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హైఅలర్ట్

## ఉగ్రదాడుల నేపథ్యంలో కేంద్రం అప్రమత్తం



**న్యూఢిల్లీ, జనవరి 17:** గణతంత్ర దినోత్సవం-2026 సందర్భంగా అన్ని రాష్ట్రాలకు భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర గ్రూపులు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్ సహా పలు ప్రధాన నగరాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐః) హెచ్చరించింది. ఆయా నగరాల్లోని రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉగ్రమూకలు గగనతలం నుంచి డ్రోన్ల ద్వారా దాడులు జరిపే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ నిఘా పెంచారు అధికారులు. ఇప్పటికే సుమారు 50,000 మందికి పైగా పోలీసులు, 65 కంపెనీల పారామిలిటరీ దళాలు ఢిల్లీలో మోహరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల భద్రతా బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో పేర్కొంది.

# జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డుల విడుదల



**న్యూఢిల్లీ, జనవరి 17 :** జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. జనవరి 21, 22, 23, 24 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డుల్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్-1 పరీక్ష, 29న పేపర్ -2 పరీక్ష జరగనున్నాయి. ప్రస్తుతానికి తొలి నాలుగు రోజుల అడ్మిట్ కార్డులను విడుదల చేయగా.. 28, 29 తేదీల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తర్వాత విడుదల చేయనున్నారు. మొత్తం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. తొలి షిఫ్టు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

# పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి



రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారని సీఎం అన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సీఎం పర్యటన

- సీపీఐ శతవార్షికోత్సవ సభలో పాల్గొననున్న రేవంత్
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- మేడారంలో ఆలయం ప్రారంభించనున్న సీఎం
- అక్కడే కేబినేట్ భేటీకి ఏర్పాట్లు పూర్తి



**వరంగల్, జనవరి 17:** ఖమ్మం వరంగల్ జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి నేడు పర్యటించనున్నారు. ఖమ్మంలో సీపీఐ వందో వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. మద్దులపల్లిలో జెఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపనతో పాటు, నర్సింగ్ కాలేజీని ప్రారంభిస్తారు. వ్యవసాయ మార్కెట్ ప్రారంభంతో పాటు మున్నేరు లింక్ కెనాల్ ప్రారంభిస్తారు. కూసుమంచిలో వందపడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. ఇకపోతే వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. మేడారంలో అమ్మవారి గద్దెలను ప్రారంభిస్తారు. అనంతరం మేడారంలో కేబినెట్ భేటీ ఉంటుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులంతా అక్కడికి చేరుకుంటారు. మేడారంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేబినేట్‌లో పలు కీలక అంశాలు చర్చించనున్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికలపైనా చర్చిస్తారని సమాచారం. ఇకపోతే మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీతక్క వివరించారు.

# అర్వపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## ఇద్దరు టీచర్ల మృతి

## ముగ్గురు టీచర్లకు తీవ్ర గాయాలు



**సూర్యాపేట, జనవరి 17:** అర్వపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. మొత్తం ఐదుగురు ఉపాధ్యాయులున్న కారు.. స్కూల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సంక్రాంతి సెలవుల అనంతరం.. శనివారం స్కూళ్లు తెరుచుకోవడంతో రోజువారీ విధుల్లో భాగంగా నల్గొండ నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ప్రభుత్వ పాఠశాలకు కారులో బయలుదేరారు. అయితే.. అర్వపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయుల్లో కస్తూర్బా గాంధీ ఏఎస్‌వో కల్పన అక్కడికక్కడే మృతి చెందారు. హెడ్‌మాస్టర్ గీత పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ఆమె ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులు ప్రస్తుతం.. సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే.. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంక్రాంతి సెలవుల అనంతరం శనివారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో తుంగతుర్తిలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ఓ కారులో తుంగతుర్తికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అరవపల్లి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తుంగతుర్తి కస్తూర్బా విద్యాలయంలో ఎస్వోగా పనిచేస్తున్న కల్పన (40) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న గీతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో తుదిశ్వాస విడిచారు. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు కావడంతో 108లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

# జనవరి 28 నుండి మహా జాతర



**ములుగు, జనవరి 17:** రెండేళ్లకోమారు జరిగే మేడారం జాతర ఈ యేడు జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరుగుతుంది. జాతర మొదటి రోజైన 28న కన్నేపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్టింప చేస్తారు. రెండవ రోజున 29నసమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గ్దదెపై ప్రతిష్టింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించుకుంటారు. తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసిల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క - సారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గిరిజనుల ఆచారం మేరకు ఈ సంప్రదాయ జాతరకు ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. గద్దెలను కొత్తగా నిర్మించింది. ఈ పనులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభిస్తారు.

# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

- సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేలా చర్యలు
- సికింద్రాబాద్‌పై పోరాటం ఆపేది లేదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 17 :** హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వీకేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. 'అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కాలె యాదయ్య, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దేశపతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# ముస్నిపల్ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బీజేపీ హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, జనవరి 17:** రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్‌రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్దాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేంద్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.



# ఒక్క చాన్స్ ప్లీజ్..

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు..

**హైదరాబాద్, జనవరి 17:** కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. అదే విధంగా బీఆర్ఎస్ కు ఓటేస్తే... గెలిచిన వాళ్లంతా మళ్లీ కాంగ్రెస్ గూటికే వెళతారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సికింద్రాబాద్ లోని క్లాసిక్ గార్డెన్ లో జరిగిన 'బీజేపీ మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సమ్మేళనం'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. రాబోయే మున్సిపాలిటీ బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజలను అభ్యర్థించారు. అదే విధంగా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో మార్క్ ఏంటో చూపిస్తామన్నారు. అత్యధిక కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు గెలిపిస్తే కేంద్రం నుండి అధిక నిధులు తెస్తామన్నారు. అవసరమైతే సీఎస్ఆర్ నిధులు తెచ్చి బీజేపీ పాలిత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను డెవలప్ మెంట్ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో మున్సిపాలిటీలకు ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కు ఓటేస్తే... గెలిచిన వాళ్లంతా మళ్లీ కాంగ్రెస్ గూటికే వెళతారన్నారు. కరీంనగర్, నిజామాబాద్, బైంసా, నిర్మల్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో మజ్లిస్ దోస్తీ చేస్తుందని అన్నారు. బీజేపీ గెలిచే చోట ఓట్లను తారుమారు చేసి మజ్లిస్ కు అధిక సీట్లు వచ్చేలా డీలిమిటేషన్ పేరుతో కాంగ్రెస్ కుట్రలు చేసిందన్నారు. తమకు ఒక్క చాన్స్ ఇస్తే.. కాంగ్రెస్, మజ్లిస్, బీఆర్ఎస్ కుట్రలను చిత్తు చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పైసలను నమ్ముకుని గెలవాలనుకుంటున్నాయని కానీ బీజేపీ ప్రజలను నమ్ముకుని ఎన్నికల్లోకి వెళుతోందన్నారు. అభివృద్ధి, ప్రజా సమస్యలు, హిందుత్వం.... ఈ 3 అంశాలే బీజేపీ ఎన్నికల ఎజెండాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇక నుండి పోలింగ్ జరిగే వరకు ఒక్కో ఇంటికి 6 సార్లు వెళ్లాలని, ముఖ్యంగా వార్డుల వారీగా సమస్యలున్న చోటకే వెళ్లి భరోసా ఇవ్వాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ క్యాడర్ కు , నాయకులకు పిలుపునిచ్చారు.

# ఇండిగోపై ప్రభుత్వం కఠిన చర్యలు

## ₹22.20 కోట్ల జరిమానా, సీఈవోకు కాషన్



**న్యూ ఢిల్లీ, జనవరి 17 :** డిసెంబర్ 3 నుంచి 5, 2025 మధ్య ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో చోటుచేసుకున్న భారీ విమాన ఆలస్యాలు, రద్దుల ఘటనపై కేంద్ర పౌర విమానయాన శాఖ ఆదేశాలతో డీజీసీఏ సమగ్ర విచారణ చేపట్టింది. ఈ ఘటనల వల్ల లక్షలాది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వెల్లడైంది. విచారణ కాలంలో మొత్తం 2,507 విమానాలు రద్దు, 1,852 విమానాలు ఆలస్యం కాగా, మూడు లక్షలకుపైగా ప్రయాణికులు ప్రభావితమయ్యారని డీజీసీఏ పేర్కొంది. కార్యకలాపాల్లో అతిగా ఆప్టిమైజేషన్, ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల అమలులో వైఫల్యం, రోస్టరింగ్‌లో తగిన బఫర్ లేకపోవడం, నిర్వహణ పర్యవేక్షణ లోపాలు ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి. ఈ ఉల్లంఘనల నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై డీజీసీఏ కఠిన చర్యలు తీసుకుంది. సంస్థ సీఈఓకు కాషన్, సీఓఓకు వార్నింగ్ జారీ చేయగా, ఎస్వీపీ(ఓసీసీ)ను బాధ్యతల నుంచి తొలగించింది. అదేవిధంగా, ఇతర సీనియర్ అధికారులకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. వివిధ సీఏఆర్ నిబంధనల ఉల్లంఘనలకు గాను ఇండిగోపై ₹22.20 కోట్ల జరిమానా విధించిన డీజీసీఏ, భవిష్యత్తులో సంస్కరణల అమలుకు భరోసాగా ₹50 కోట్ల బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని ఆదేశించింది. ప్రభావిత ప్రయాణికులకు సంబంధించి, రీఫండ్‌లతో పాటు సీఏఆర్ ప్రకారం పరిహారం చెల్లించడమే కాకుండా, అదనంగా ₹10,000 విలువైన 'జెస్చర్ ఆఫ్ కేర్' వౌచర్ అందజేయాలని ఇండిగోకు సూచించింది. భద్రత, నియంత్రణ నిబంధనల అనుసరణే అత్యున్నత ప్రాధాన్యమని డీజీసీఏ స్పష్టం చేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థాత్మక సంస్కరణలు తప్పనిసరిగా అమలు చేస్తామని హెచ్చరించింది.




# ఇక సంగారెడ్డి నుంచి పోటీ చేయ!

## కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

**సంగారెడ్డి, జనవరి 17:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాను జీవితంలో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ' ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీని.. నేను సంగారెడ్డికి పిలిచి అవమానించానేమో అని ఫీల్ అయ్యాను. నాకోసం ఆయన సంగారెడ్డికి వచ్చారు. నన్ను గెలిపించాలని గట్టిగా ప్రచారం చేశారు. అంతగా ఆయన ప్రచారం చేసినప్పటికీ ఇక్కడి ప్రజలు నన్ను ఓడించారు. నేను చాలా ఆవేదన చెందాను. అందుకే సంగారెడ్డిలో నేను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయను' అని అన్నారు. రాహుల్ గాంధీ నా భుజంపై చేయివేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. నన్ను ఇక్కడి వారు ఓడించారు. నా జీవితంలో ఈ ఓటమి మరిచిపోలేనిది. నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు. సంగారెడ్డిలోని మేధావులు, కొందరు పెద్దలు మాత్రమే. రేపటి రోజు సంగారెడ్డిలో నా భార్య నిర్మలా పోటీచేసినా నేను ప్రచారానికి రాను. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తాను. కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయను' అంటూ జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

# చౌమహల్లాలో సంగీత కార్యక్రమం

## సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్‌హాజరు



**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని చారిత్రక చౌమహల్లా ప్యాలెస్‌లో ఘజల్–సూఫీ సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో పాటు పలువురు ప్రము–ఖులు హాజరై సంగీత సాయంత్రాన్ని ఆస్వాదించారు. డెక్కన్ ప్రాంతపు సమ్మిళిత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఘజల్, సూఫీ గాయని అనితా సింగ్వి భావగర్భితమైన గానంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సాంస్కృతిక సాయంత్రానికి కళాభిమానుల నుంచి విశేష స్పందన లభించగా, చౌమహల్లా ప్యాలెస్ ఆధ్యాత్మిక సంగీత శ్రావ్యతతో పరవశించింది. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, టెమ్రిస్అధ్యక్షుడు ఫహీం ఖురేషీ, రాజ్యసభ సభ్యులు అభిషేక్ సింగ్వి, రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థపై కమిటీ

## కొత్తగా 'సికింద్రాబాద్ జిల్లా' ఏర్పాటుకు సంకేతాలు




**హైదరాబాద్, జనవరి 17:** తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల పరిధుల్లో మార్పులు, చేర్పులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఆరు నెలల్లో సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ కమిటీ నివేదికకు ముందే ముఖ్యమంత్రి నుంచి ప్రధాన మీడియాకు లీకుల ద్వారా కొంత కీలక సమాచారం చేరినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అందులో భాగంగా, రాష్ట్ర రాజధానిలో భాగమైన చారిత్రక సికింద్రాబాద్‌ను కొత్తగా జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్లు సమాచారం. ప్రతిపాదిత ప్రణాళిక ప్రకారం, సికింద్రాబాద్‌తో పాటు సనత్‌నగర్, మల్కాజిగిరి ప్రాంతాలను కలుపుతూ 'సికింద్రాబాద్ జిల్లా'ను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. జనాభా, పరిపాలనా సౌలభ్యం, పట్టణ విస్తరణను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిపాలనా భారమంతా పెరిగిన నేపథ్యంలో, కొత్త జిల్లా ఏర్పాటుతో సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. మరోవైపు, జిల్లాల సంఖ్య పెంపుపై రాజకీయ, పరిపాలనా వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటుపై మాత్రం ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన సంకల్పం ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



సంపాదకీయం

# అనేక దేశాల్లో అస్థిరతకు కుట్రలు

ప్రపంచంపై పెత్తనం సాగించాలన్న ట్రంప్ రాజ్యకాంక్ష కారణంగా అనేక దేశాల్లో అస్థిరత నెలకొంటోంది. అయితే సుంకాలు లేదంటే బెదరింపులు..మరీ అయితే దాడులు అన్న మంత్రాన్ని ఎంచుకున్న ట్రంప్ రంపం కోతలు పెడుతున్నారు. అనేక దేశాలు ఇప్పుడు ట్రంప్ గుప్పిట్లో ఇరుక్కున్నాయి. పైకి తీయగా మాట్లాడుతూ..తన ధృతరాష్ట్ర కౌగిలిని బిగిస్తున్నారు. వెనిజులా తరవాత ఇరాన్‌లో అదే తరహా సన్నాహాలకు దిగినా ఎందుకనో వెనకడుగు వేశారు. అమెరికా సిఐఎ ఇప్పుడు ప్రపంచంలో చిచ్చు పెట్టే పనిలో ఉంది. శ్రీలంక,బంగ్లాదేశ్,నేపాల్, ఇరాన్, ఇరాక్, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక దేశాల్లో అంతర్గత కలహాలకు ఆజ్యం పోస్తోంది. భారత్‌ను దెబ్బతీసేందుకు నానారకాల గడ్డీ కరిచింది. సిఐఎ గుప్పిట తెలియ కుండానే పడ్డ ఎందరో తమ దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. అందులో భారత్‌లోని కొందరు నేతలు కూడా ఉన్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే కొంతకాలంగా భారత్‌లో అస్థిరతకు అనేక రకాల ప్రయత్నాలు సాగాయి. మణిపూర్ అల్లర్లు, రైతుల ఆందోళనలు, సర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, బంగ్లాను ఎగదోయడం, పాక్‌కు పాలుపోసి పెంచడం వంటివన్నీ భారత్‌లో అస్థిరతకు కారణాలుగా చూడాలి. తాజాగా ఇరాన్‌లో సాగుతున్న ఆందోళనలను అమెరికా ఎగదోస్తోంది. అక్కడి ప్రజల్లో విషం నిండానికి ప్రయత్నం చేస్తోంది. అయితే ఇరాన్‌పై సైనిక చర్య తప్పదంటూ ఇటీవల వరుస హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారుల అణచివేత విషయంలో టెహ్రాన్ మొత్తబడినట్లు కనిపిస్తోందని పేర్కొన్న ఆయన.. సమీప భవిష్యత్తులో ఆ దేశంపై దాడి చేయబోమన్న సంకేతాలిచ్చారు. దనీఇకి కూడా కారణం లేకపోలేదు. ఇరాన్‌పై దాడులకు దిగితే ఆ దేశంలో అనిశ్చితి మరింత పెరిగే ముప్పుండటంతో పాటు అది దీర్ఘకాలిక యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వచ్చాయి. అలాగే ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశాలు ఉండటం క ఊడా అమెరికా గమనించి ఉంటుంది. పరిమిత స్థాయి సైనిక చర్యతో ఆగిపోకుండా దీర్ఘకాలం పాటు దాడులు కొనసాగించక తప్పని పరిస్థితులు నెలకొంటే కొత్త తలనొప్పులు రావచ్చని ట్రంప్‌కు సలహాలు అందాయని అంటున్నారు. అందుకే సైనిక చర్యపై ట్రంప్ నిర్ణయం మార్పునకు కారణమైనట్లు తెలుస్తోంది. నిరసనకారులపై ఉక్కుపాదం మోపితే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ పదేపదే హెచ్చరించాక కొంత తగ్గారని గమనించాలి. 24 గంటల్లోనే టెహ్రాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యకు దిగడం ఖాయమనీ అంతా అనుకున్నారు. పశ్చిమాసియాలోని పలు వైమానిక స్థావరాల నుంచి అమెరికా హడావుడిగా తన బలగాలను కొంతమేర ఉపసంహరించుకోవడంతో సైనిక చర్య తప్పదన్న వార్తలకు బలాన్నిచ్చాయి. అయితే ట్రంప్ కొంత తెలివిని ప్రదర్శించారనే అనుకోవాలి. అందుకే ప్రస్తుతానికి సైనిక చర్య ప్రయత్నాలు నిలిచిపోయినట్టే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్న ఎర్ఫాన్ సొల్తానీ అనే 26 ఏళ్ల యువకుడికి ఈ నెల 14న మరణశిక్ష అమలు చేయాలని ఇరాన్ తొలుత భావించింది. కానీ చివరి నిమిషాల్లో ఆ శిక్ష అమలును నిలిపివేసింది. సైనిక చర్యపై ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇది బాగా ఉపయోగపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు కూడా ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరాన్ అంత తేలికగా తలొగ్గబోదని ట్రంప్‌నకు నెతన్యాహు హితబోధ చ ఏసి ఉంటారని కూడా అంటున్నారు. గతంలో టెహ్రాన్‌పై సైనిక చర్యను కోరిన నెతన్యాహుయే ఇప్పుడు దాడులు వద్దని స్వయంగా చెప్పడం ట్రంప్‌ను పునరాలోచనలో పడేసి ఉంటుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ వంటి దేశాలతో పాటు ఈజిప్టు కూడా సైనిక చర్య నివారణకు ట్రంప్‌తో ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేశాయి. ఇరాన్‌పై దాడులు ప్రాంతీయంగా యుద్ధమేఘాలకు కారణమవుతాయని, దానివల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుందని సూచించాయి. అయితే ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండను ఆపడమే తన ప్రాథమిక లక్ష్యమని ఆయా దేశాల అధికారులతో ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ ఆ దిశగా సంకేతాలిస్తే సైనిక చర్యకు దిగబోనని స్పష్టం చేశారు. ఆపై కొన్ని గంటలకే ఎర్ఫాన్ సొల్తానీ మరణశిక్షను టెహ్రాన్ నిలిపివేయడం, 'ఇది శుభవార్త.. ఇదే కొనసాగుతుందని ఆశిస్తున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసనకారుల మరణశిక్షలను నిలిపివేసినందుకు ఇరాన్‌కు ట్రంప్ కృతజ్ఞతలు తెలపడం గమనార్హం. ఇదిలావుంటే ఇరాన్ అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం...ఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టులపై ఖచ్చితమైన సమాచారం అందడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణించారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబంధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంబించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ వచ్చారు. మొత్తంగా ట్రంప్ వెనక్కి తగ్గినా ఇరాన్ తాజా పరిస్తితులు దారికి వస్తాయా అన్నది అనుమానమే. ఛాందసవాద పాలన కారణంగా ప్రజలు నలగి పోతున్నారు. దీనినుంచి బయటపడే మార్గాలను ఇరాన్ ఆలోచించాల్సి ఉంది.

# బీహార్ తర్వాత ఇప్పుడు బెంగాల్ వంతు

- బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది
- చొరబాటుదారులకు తృణమూల్ అండ
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- మాల్దా సభలో తృణమూల్‌ను ఏకిపారేసిన ప్రధాని మోడీ



**కోల్‌కతా, జనవరి 17:** బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. 'టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది' అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. 'ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి' అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షిదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళ్తున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్

మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని




**కోల్‌కతా, జనవరి 17:** భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా- నుంచి అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

# ఇరాన్ అల్లర్ల కుట్రదారు ట్రంప్

తీవ్ర విమర్శలు చేసిన ఇరాన్ సుప్రీం ఖమేని



**టెహ్రాన్, జనవరి 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటు చేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు. ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు' అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

# బంగ్లాలో ఆగని హింస

మరో హిందూ యువకుడి దారుణ హత్య

**ఢాకా, జనవరి 17:** బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. తాజాగా మరో హిందువును కారుతో తొక్కించి మరీ దారుణంగా హత్య చేశారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. రిపోన్ డబ్బు ఇవ్వాల్సిందిగా హాషేమ్‌ను అడగ్గా అతడిపైకి కారుతో దూసుకెళ్లాడు. కారు తనపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాల పాలైన రిపోన్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అబుల్ హాషేమ్‌ను, అతడి కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు

రెండు విమానాల్లో పలువురి రాక

**న్యూఢిల్లీ, జనవరి17:** ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్‌స్పేస్ తాత్కాలికంగా మూసి వేయడంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్‌స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో సాయం చేసిందంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు. ఓ ఇంజనీర్ మాట్లాడుతూ.. 'ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి' అని అన్నారు.



# చంద్రగిరి కొండ ఉత్సవంలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



- శ్రీమూలస్థాన ఎల్లమ్మకు పట్టువస్త్రాలను అందజేత
- సాదరంగా స్వాగతం పలికిన గ్రామ పెద్దలు

**నేటి సాక్షి తిరుపతి, చంద్రగిరి:** చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మతల్లి సంక్రాంతి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కొండ చుట్టు మహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. చంద్రగిరిలోని ద్రౌపతీ సమేత ధర్మరాజులు, మిట్ట మీద గంగమ్మ, అంకాలమ్మ, వేశాలమ్మ, నడివీధి గంగమ్మలతో పాటు గ్రామ దేవతలు అంతా కలసి ఊరేగింపుగా బయలుదేరే కొండ చుట్టుకు తుడా మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సమన్వకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో చంద్రగిరి పట్టణంలోని ధర్మరాజుల గుడి వద్దకు చేరుకున్న ఆయనకు గ్రామ పెద్దలు సాదర స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనంను దగ్గరుండి చేయించారు. అక్కడ నుంచి ఊరేగింపుగా శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న దేవతల రూపాలను తిలకించిన మోహిత్ రెడ్డి ఆయా వాహనాల వద్దనున్న పూజారిలు హారతులు అందించారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కూడా హాజరు కావడంతో గ్రామ పెద్దలు, స్థానికులు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# రెండో ఎడిషన్ టార్చ్ ర్యాలీకి స్వాగతం

- మండల విద్యాధికారి పి. ప్రభాకర్



**నేటి సాక్షి, ధర్మారం:** చీఫ్ మినిస్టర్ కప్-2025 రెండవ ఎడిషన్‌లో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టార్చ్ ర్యాలీకి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో శనివారం మండల విద్యాధికారి పి. ప్రభాకర్ ఘనంగా స్వాగతం పలికారు. మండల విద్యావనరుల కేంద్రం నుండి ప్రారంభమైన ఈ టార్చ్ ర్యాలీ ధర్మారం పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా చీఫ్ మినిస్టర్ కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో 44 రకాల క్రీడలు నిర్వహించబడతాయని, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. గ్రామీణ స్థాయి నుంచి మండల స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి మీదుగా రాష్ట్ర స్థాయి వరకు ఈ పోటీలు కొనసాగుతాయని పేర్కొంటూ, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సురేష్, నందీ మేడారం సర్పంచ్ వీర్ పాల్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు షీలా, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోదాంపద కొండపోచమ్మ జాతర



- నేటి నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- ఉగాది వరకు వైభవంగా జాతర
- ముస్తాబైన దేవాలయం
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

**నేటిసాక్షి : జగదేవపూర్ :** పచ్చని పొలాలు.. పక్షుల కిలకిలలు.. ఎత్తయిన నల్లని గుట్టలు.. పల్లె జనానికి కోరిన కోర్కులు తీర్చే కల్పవల్లి. కొండపోచమ్మ దేవాలయం ఉత్సవాలకు ముస్తాబైంది. కొమురవెల్లి మల్లన్నకు కోటి దండాలు.. కొండపోచమ్మకు ముక్కోటి దండాలు.. కరుణించి కాపాడే తల్లి పోచమ్మ.. శతకోటి దండాలు.. అంటూ భక్తులు అమ్మవారి నామస్మరణతో దర్శించుకుంటారు. మూడు నెలల పాటు అంగరంగ వైభవంగా కొండపోచమ్మ జాతర కొనసాగుతుంది. తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన శ్రీ కొండపోచమ్మ దేవస్థానం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్ నర్సపూర్ గ్రామానికి ఉత్తర దిశలో ఉంది. కొండపోచమ్మ నామంతో జగన్మాత శీలాదేవి భక్తుల పూజలందుకుంటుంది. ఈ నెల జనవరి 19 వ తేదీ నుండి ఉత్సవాలు ప్రారంభమై మూడు నెలల వరకు ఉత్సవాలు కొనసాగుతు మర్చి 19 నెల వరకూ జరుగుతాయి. జాతరకు హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి వరంగల్, నల్గొండ. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు.

## ఆలయచరిత్ర

కొండపోచమ్మ ఆలయం హైదరాబాద్- కరీంనగర్ రాజీవ్ రహదారి మధ్యగల కొండకండ్ల గ్రామం నుంచి 16 కిలో మీటర్ల దూరంలో ఉంది. సంతానం లేనివారు అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మ వారు చేర్యాల మండల పరిధి కొమురవెల్లి మల్లికా ర్జునస్వామికి చెల్లెలని ప్రతీతి, కొన్ని వందల ఏళ్ల క్రితం కొండపోచమ్మ కూడా కొమరవెల్లిలోనే ఉండేదని భక్తుల నమ్మకం. ఒక సందర్భంలో అలిగి తీగుల్ నర్సపూర్ లోని అడవుల్లో స్థిరపడగా అన్న మల్లన్న తన సోదరి పోచమ్మ జాడ తెలుసుకొని వస్తాడు. ఇంటికి పోదామని కోరగా ఆమె మొండికే యడంతో, మల్లన్న ఏం వరం కావాలో కోరుకోమ న్నాడట. అప్పుడు పోచమ్మ కొమరవెల్లికి వచ్చే ప్రతీ భక్తుడూ తన వద్దకు వచ్చి దర్శనం చేసుకునేలా వర మివ్వాలని కోరిందట. అలా మల్లన్న ఇచ్చిన వరం తో కొమరవెల్లి కొచ్చే యాత్రికులు కొండపోచమ్మను దర్శించుకుంటారు.

## ఏర్పాట్లు పూర్తి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని వస తులు కల్పించామని కొండపోచ్చమ్మ దేవాలయ కార్యనిర్వహణ అధికారి రవి కుమార్, చైర్ పర్సన్ కప్పర అనుగీత హరిప్రసాద్ రావు తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, జనగామ బస్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఆది,సోమ, మంగళవారాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. అవాంచనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జగదేవ్ పూర్ ఎస్ఐ కృష్ణ రెడ్డి తెలిపారు.

## ఆకర్షించే లష్కర్ బోనాలు

జాతరకు వచ్చే భక్తులు దేవాలయం వద్ద ఉన్న చెరువులో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించుకుంటూరు. అమ్మవారి బోనాన్ని పసుపు, కుంకుమలతో అమ్మవారి సన్నిదికి తెస్తారు. వాటిలో రాష్ట్ర రాజధాని హైద్రాబాద్, సికింద్రాబాద్ భక్తులు తెచ్చే బోనాలు ప్రత్యేక ఆకర్షణ. అలంకరించి ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి తెస్తారు.

# రాయికల్ మున్సిపాలిటీలో,రిజర్వేషన్లు ఖరారు

**రాయికల్ - నేటి సాక్షి (ఇమ్మడి విజయ్ కుమార్):** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాయికల్ మున్సిపాలిటీకి చెందిన 12 వార్డుల రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఖరారు చేశారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. అదేవిధంగా రాయికల్ మున్సిపల్ చైర్మన్ పదవిని జనరల్ కేటగిరీగా ఖరారు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## ఖరారైన వార్డు రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి:

1వ వార్డు - బీసీ మహిళ
2వ వార్డు - బీసీ జనరల్
3వ వార్డు - ఎస్టీ జనరల్
4వ వార్డు - జనరల్ మహిళ
5వ వార్డు - జనరల్ మహిళ
6వ వార్డు - బీసీ మహిళ
7వ వార్డు - బీసీ జనరల్
8వ వార్డు - జనరల్
9వ వార్డు - జనరల్ మహిళ
10వ వార్డు - జనరల్ మహిళ
11వ వార్డు - ఎస్సీ జనరల్
12వ వార్డు - జనరల్




# కనుమ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నారా



**నేటి సాక్షి - తిరుపతి,రామచంద్రాపురం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కనుమ పండుగ సందర్భంగా తన స్వగ్రామం నారావారిపల్లెలో కుటుంబ సభ్యులతో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం సమీప బంధువు, రామచంద్రాపురం మండలం పుల్లమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన ఎల్. జయచంద్ర నాయుడు కుటుంబాన్ని ఆయన కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో స్నేహపూర్వకంగా ముచ్చటించిన ముఖ్యమంత్రి, వారి పిల్లలు ఏమి చదువుతున్నారో అడిగి తెలుసుకుని, చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే కుటుంబ పరిస్థితుల గురించి ఆరా తీసిన సీఎం, ఎలాంటి సహాయం అవసరమైనా నిర్భయంగా సంప్రదించాలని, ప్రభుత్వం తరఫున మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవులు, కవిత, కార్తీక్, మోక్షాంజలి, దేవాన్ష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

## ఏర్పాట్లపై సన్నాహక సమావేశం



**నేటి సాక్షి - కొమరం భీం ఆసిఫాబాద్:** ఈ నెల 19వ తేదీ (సోమవారం) గౌరవ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆసిఫాబాద్ జిల్లా పర్యటనను పురస్కరించుకుని, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రజల సమీకరణ, అలాగే రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన సమష్టి కృషి కార్యాచరణపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లాలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని సమావేశంలో పిలుపునిచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు గార్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# మానాలలో గ్రామసభ



**నేటి సాక్షి రుద్రంగి:(కోక్కుల వంశీ):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్ , ఉప సర్పంచ్ దాసరి అశోక్, పంచాయతీ కార్యదర్శి బాబు ఆధ్వర్యంలో గ్రామసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ, స్థానిక ఎస్సై మోతీరాం, ఎఇ హాజరయ్యారు. ఈ సమావేశాలో గ్రామ అభివృద్ధి ప్రణాళికా, రూప కల్పన, అమలుపై చర్చించి. ముందుగా రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో త్రాగు నీటి సమస్య లేకుండా చూడటం ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. అనంతరం జలసేవా అంకలన్ కార్యక్రమంలో భాగంగా విలేజ్ వాటర్, శానిటేషన్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రంలో వార్డు సభ్యులు కార్యదర్శి బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ గా గెజిట్ జారీ..

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**నేటిసాక్షి, నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ మున్సిపాలిటీ ని నగర పాలక సంస్థగా మారుస్తూ గజిట్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మున్సిపాలిటీ భవనంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్ర శేఖర్ తో కలిసి నల్గొండ మున్సిపల్ కార్పోరేషన్ ను, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు హాఫీజ్ ఖాన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద సాంగ్ షూటింగ్

- జబర్దస్త్ టీం వెంకీ మంకీ ఆధ్వర్యంలో చిత్రీకరణ ప్రారంభం



**నేటి సాక్షి, గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద శనివారం జబర్దస్త్ టీం వెంకీ మంకీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం జరగనున్న సమ్మక్క సారలమ్మ సాంగ్ షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు వెంకీ మంకీ తెలిపారు. ఈ పాట చిత్రీకరణలో లాస్య ప్రియా, అమృత్, మాస్టర్, సన్నీ పీటీపీ, అశోక్ బోలే తదితరులు నటిస్తున్నారని పేర్కొన్నారు. వెంకీ మంకీ మాట్లాడుతూ.. గన్నేరువరం సమ్మక్క సారలమ్మ గద్దెలకు ఉన్న ఆధ్యాత్మిక మహాత్యం, విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బోయిని పోశయ్య, కోశాధికారి బుర్ర అంజయ్య గౌడ్, మాజీ కమిటీ చైర్మన్ దేశరాజు కనకయ్య, బుర్ర మల్లయ్య గౌడ్, మూవీ యాక్టర్ బుర్ర రాజ్ కోటి గౌడ్, బుర్ర కొటేశ్వర్ గౌడ్, బుర్ర నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ ప్రమాదంలో తండ్రి కొడుకు మృతి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** మిరుదొడ్డి మండలం ధర్మారం లో విషాదం లారీ ప్రమాదం తండ్రి కొడుకుల ఉసురు తీసింది. తొగుట మండలంలోని జప్తి లింగారెడ్డి పల్లి ఎక్స్ రోడ్ సమీపంలో ఆల్వాల వడ్డెర కాలనీ వద్ద లారీ బైక్ డీ కొట్టడంతో మిరుదొడ్డి మండలం ధర్మారం కు చెందిన తండ్రి కొడుకులు చల్మెడ కుమార చారి (39), ఆయన కుమారుడు సుశాంత్ లకు తీవ్ర గాయాలు కాగా సుశాంత్ అక్కడికక్కడే మరణించగా, కుమార చారిని ఆసుపత్రికి తరలించగా మరణించాడు. కుమార స్వామి కోడలు రమ్యశ్రీ కి కాలు విరిగింది.. ఎదురుగా వెళ్తున్న బైక్ కు లారీ డీ కొట్టడం తో పెను ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది.

# ఆశ వర్కర్లకు చీరల పంపిణీ.

**ఆశ వర్కర్లకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ సర్పంచ్ .**



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన చీరలను శనివారం డాక్టర్ సుభాష్ గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లు ప్రజల ఆరోగ్యం కోసం వారు చేస్తున్న సేవలు మరువలేనవి అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య వార్డ్ మెంబర్స్. ఏఎన్ఎం ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# సిపిఐ సభ వాలంటీర్ల శిక్షణ



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరులో కవాతు ట్రైనింగ్ చేస్తున్న యూత్ సేవాదళ్ సభ్యులు ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు విజయోత్సవం ముగింపు బహిరంగ సభ లో పాల్గొనే పార్టీ యూత్ సేవాదళ్ వాలంటీర్లకు శనివారం చిలుకూరులో పార్టీ సీనియర్ నాయకులు.. మేకల శ్రీనివాసరావు ట్రైనింగ్ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలుకూరు గ్రామం నుండి సుమారు 50 మంది వాలంటీర్లను సిద్ధం చేస్తున్నట్లుగా తెలిపారు అందరూ రెడ్ టీ షర్ట్ వాలంటీర్లుకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లుగా తెలిపారు . వీరంతా సభలో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు

# రెండు గంటల్లో బైక్ దొంగతనం కేసు ఛేదన

- నిందితుడి అరెస్ట్ - ద్విచక్ర వాహనం స్వాధీనం
- త్వరితగతిన స్పందించిన ఎస్సై, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ నితికా పంత్



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** బహిరంగ ప్రదేశంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన కేసును కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు కేవలం రెండు గంటల్లోనే ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై కె. సందీప్ కుమార్ తెలిపారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామానికి చెందిన నాయిని లచ్చన్న (తండ్రి: శంకర్) శనివారం ఉదయం కాగజ్‌నగర్ మండలం వంజిరి శివారులో నిర్వహించిన మేకల వారసంతకు హాజరయ్యాడు. సంత సమీపంలో తన లిలిహీరో స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనం (నంబర్: TG 0069, విలువ సుమారు రూ. 1 లక్ష)లిలిను రోడ్డుపక్కన నిలిపివేసి సంతలోకి వెళ్లాడు. కొంతసేపటి తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సందీప్ కుమార్, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా లిలికాగజ్ నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన పోల్క వెంకటేష్ (34)లిలిను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి దొంగిలించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో కానిస్టేబుల్స్ గుర్లే రమణంద్, జె. అంకుష్, జె. శంకర్ మరియు హోమ్ గార్డ్ దీపక్లు కీలకంగా సహకరించారు. కేవలం రెండు గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న కాగజ్ నగర్ రూరల్ ఎస్సై సందీప్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ అభినందించారు.

# ఖమ్మంలో బహిరంగ సభను విజయవంతం చేయాలి

**సిబిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు.**



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు ఖమ్మంలో జరిగే సిపిఐ పార్టీ వంద సంవత్సరాల బహిరంగ సభ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.. సిపిఐ పార్టీ సానుభూతిపరులు నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. శనివారం చిలుకూరు సిపిఐ పార్టీ భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశాల మాట్లాడుతూ భారత గడ్డపై వంద సంవత్సరాల ప్రస్థానంలో ఎన్నో ఉద్యమాలు. చేసి భూమికోసం భుక్తి కోసం ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేపట్టి ప్రజల సమస్యలపై పరిష్కారాలకు కృషి చేసిందన్నారు.. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు. సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు జాన్ పాషా కందుకూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు

# జలకంఠేశ్వర స్వామివారిని దర్శించుకున్న మాతాజీ



**నేటి సాక్షి, తిరుపతి,రామచంద్రపురం:** రామచంద్రపురం మండలంలోని రాయల చెరువు కట్ట దిగువన శ్రీకృష్ణదేవరాయలు నిర్మించిన పురాతన, అతి శక్తివంతమైన శ్రీ భవాని జలకంఠేశ్వర స్వామివారిని మాస శివరాత్రి సందర్భంగా శనివారం సాయంత్రం శ్రీ శక్తి పీఠాధిస్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన పీఠాధిపతిని మాతాజీని ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించగా, ఆలయ సేవకులు తంజావూరు జయభారతి, మణి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దర్శనం కల్పించారు. అలాగే శ్రీ అభయ హస్త ఆంజనేయ స్వామివారికి విశేష పూజలు చేశారు. పూజానంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులను మాతాజీ వారు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాతాజీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల మాధవి, తిరుమలరెడ్డి దంపతులు, మాజీ ఎంపీపీ అత్తూరు దామోదర రెడ్డి, అబ్బూరి దేవరాజులు నాయుడు, కొడవటిగంటి దొరస్వామి చౌదరి, పిల్లపాలెం లక్ష్మీదేవి-మునిశేఖర్ రెడ్డి దంపతులు, కొక్కంటి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సమస్యలు తీర్చాలని ఎమ్మెల్సీ లకు వినతి



**రాయికల్- నేటి సాక్షి ( ఇమ్మడి విజయ్ కుమార్ ):** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాయికల్ మండల అధ్యక్షులు గూగ్లావత్ చిరంజీవి ఎమ్మెల్సీ రాములు నాయక్ మరియు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లను కలిసి మండలంలో గిరిజనులకు కావలసిన వసతుల గురించి విన్నవించారు. రాయికల్ మండల కేంద్రంలో బంజారా ఆరాధ్య దైవం అయినటువంటి జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ దానితోపాటుగా మండలంలోని వడ్డే లింగాపూర్ లో మినీ గురుకుల పాఠశాల భవనాన్ని ఐదవ తరగతి వరకు పరిమితి ఉండడం ఇబ్బందికరంగా ఉంది పై స్థాయి తరగతులు ఇంటర్ వరకు పెంచాలని కోరారు. కచ్చితంగా రాబోవు రోజులలో మండల కేంద్రంలో జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మాణం కోసం మరియు మినీ గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ పాఠశాల చేసే విధంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పడం జరిగింది. దానితోపాటు గిరిజన మంత్రి ఉన్నటువంటి జిల్లాలో గురుకుల పాఠశాల పై చదువుకు లేకపోవడం బాధాకరం అని తెలుపుతూ మంత్రి కూడా దృష్టి పెట్టి దీన్ని వెంటనే నెరవేర్చే విధంగా ఆలోచన చేయాలని మండల అధ్యక్షులు చిరంజీవి నాయక్ కోరారు.

# మైలారం మల్లికార్జున స్వామి దర్శించుకున్న రసమయి



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని మైలారం శ్రీ భ్రమరంభ సమేత స్వయంభూ మల్లికార్జున స్వామిని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాజీ సుడా చైర్మన్ జివి రామకృష్ణా రావు సిరిసిల్ల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సిద్ధం వేణు గన్నేరువరం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంపవెంకన్న మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరుశురాములు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయి శర్మ ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మహిళా మండల అధ్యక్షురాలు కుసుంబం నవీన, డైరెక్టర్లు గొల్లపెల్లి రవి, అటికెం రవీందర్ గౌడ్, గూడెల్లి తిరుపతి, సమ్మెట అనిల్, పులి రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు నూకల శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ లావణ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- జూనియర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి



**నేటి సాక్షి : జోగులాంబ గద్వాల :** జూనియర్ డాక్టర్ బి.లావణ్య కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి జిల్లా కలెక్టర్ బియ్యం సంతోష్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానోపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన లావణ్య, కుల ఉన్మాదానికి బలై దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. పేద తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి డాక్టర్ చేయాలనే ఆశతో పెంచుకున్న తమ కుమార్తెను, ప్రణయ్ తేజ ప్రేమ పేరుతో మోసం చేసి దారుణంగా హత్య చేయడం సమాజాన్ని కుదిపేసే ఘటనగా పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకొని, లావణ్యకు పూర్తి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్న లావణ్య కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని కోరారు. లావణ్య కుటుంబానికి వ్యవసాయ భూమి లేదా ప్లాటు, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా ఇంద్రమ్మ ఇల్లు, ఆర్థిక ఎక్స్‌గ్రేషియా, మంజూరు చేసి, పేదింటి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున సంపూర్ణంగా ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్

## కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం కీలక ప్రకటన



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్?కు కిక్కిచ్చే న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డుకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ మేరకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం శనివారం ప్రకటించింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగానే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది. 'ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హెూం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం' అని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో 2026 ఐపీఎల్?లో ఆర్సీబీ హెూం గ్రౌండ్ మ్యాచ్?లు చిన్నస్వామిలోనే నిర్వహించనున్నారు. ఈ వార్తతో ఆర్సీబీ ఫ్యాన్స్?లో జోష్ నిండినట్లైంది.కాగా, 2025 ఐపీఎల్?లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంతో జూన్ 04న చిన్నస్వామి స్టేడియంలో సక్సెస్ సంబరాలు నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ఊహించిన దానికంటే అధికంగా అభిమానులు రావడంతో స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. దీంతో ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది.చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని ఈ కమిషన్ తేల్చింది. దీంతో ఆ తర్వాత ఈ స్టేడియంలో నిర్వహించేందుకు షెడ్యూల్ చేసిన అన్ని మ్యాచ్?లను షిఫ్ట్ చేశారు. తర్వాత కర్ణాటక డొమెస్టిక్ మహారాజా ట్రోఫీని కూడా ఆగస్టులో మైసూరుకు తరలించారు. ఆ తర్వాత మహిళల వన్డే వరల్డ్?కప్?లోనూ చిన్నస్వామిలో కొన్ని మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, వాటిని వేరే వేదికలకు మార్చారు. విజయ్ హజారే ట్రోఫీలోని మ్యాచ్?లు కూడా ఇక్కడ జరగాల్సి ఉండగా, అనుమతి లేకపోవడంతో ఆ మ్యాచ్?లను బీసీసీఐ ఎక్స్?లెన్స్?కు తరలించారు. అయితే ఇప్పుడు కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఫ్యాన్స్?కు కచ్చితంగా ఆనందాన్ని ఇస్తుంది. కాగా, 2026 ఐపీఎల్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది.



## భక్తి పారవశ్యంలో మునిగిపోయిన స్టార్ క్రికెటర్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న నిర్ణయాత్మకమైన మూడో వన్డే కోసం టీమిండియా ఇప్పటికే ఇండోర్ చేరుకుంది. సిరీస్ 1-1 తో సమానంగా ఉండటంతో, గెలుపు గుర్రం ఎక్కాలనే కసితో ఆటగాళ్లు ఉన్నారు. అయితే మైదానంలో చెమటోడ్చడమే కాకుండా, దైవబలం కోసం టీమిండియా స్టార్ ప్లేయర్లు ఇప్పుడు ఆధ్యాత్మిక బాట పట్టారు. ఇండోర్‌కు అతి సమీపంలో ఉన్న ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగాన్ని విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్ శనివారం తెల్లవారుజామున సందర్శించుకున్నారు. భారత క్రికెట్ జట్టులో ఇప్పుడు ఆధ్యాత్మిక ధోరణి బాగా కనిపిస్తోంది. కీలకమైన మ్యాచ్‌లకు ముందు ఆటగాళ్లు ఉజ్జయిని మహాకాళుడిని దర్శించుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు జరిగే అత్యంత పవిత్రమైన భస్మ హారతిలో విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు ఆలయ ప్రాంగణంలోనే గడిపిన వీరు, నంది హాల్‌లో కూర్చుని పరమశివుని నామస్మరణలో మునిగిపోయారు. గర్భాలయ చౌకట్ నుంచి స్వామివారిని దర్శించుకుని జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ వారికి స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహుకరించింది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం అత్యంత విశిష్టమైనది. ఇది దక్షిణాభిముఖ జ్యోతిర్లింగం కావడం దీని ప్రత్యేకత. ఇక్కడ జరిగే భస్మ హారతి ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయంలో పూజలు చేస్తే అకాల మృత్యు భయం తొలగిపోతుందని, తలపెట్టిన కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే కేవలం క్రికెటర్లే కాదు, బాలీవుడ్ సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు తమ కెరీర్‌లో కష్టకాలం ఎదురైనప్పుడు లేదా పెద్ద విజయాలు సాధించినప్పుడు ఇక్కడికి వస్తుంటారు. కెఎల్ రాహుల్, గౌతమ్ గంభీర్ కూడా నిన్ననే ఈ ఆలయాన్ని సందర్శించడం విశేషం

## బంగ్లాదేశ్ సారథికి ఆయుశ్ మాత్రే నో షేక్‌హ్యాండ్

అండర్ 19 వరల్డ్‌కప్‌లో భాగంగా బులవాయో వేదికగా భారత్ - బంగ్లాదేశ్ యువ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన టీమ్‌ఇండియా తొలుత బ్యాటింగ్‌కు దిగింది. అయితే అంతకుముందు మైదానంలో అసక్తికర సంఘటన జరిగింది. టాస్ సమయంలో భారత్ కెప్టెన్ ఆయుశ్ మాత్రే, బంగ్లాదేశ్ సారథికి షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు! ప్రస్తుతం క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.ప్రస్తుతం భారత్- బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశంలో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ఈ కాంట్రవర్సీ క్రికెట్‌దాకా వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో తాజా మ్యాచ్‌లో టాస్ సమయంలో బంగ్లా కెప్టెన్ జవేద్ అబ్రార్‌తో టీమ్‌ఇండియా కెప్టెన్ ఆయుశ్ మాత్రే షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. దీంతో ఇది క్రీడావర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అయితే దీనిపై అటు బంగ్లాగానీ, భారత్‌గానీ అధికారికంగా స్పందించలేదు. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశ పేస్ బౌలర్ ముస్తాఫిజుర్‌ను బీసీసీఐ ఐపీఎల్ నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్‌ను కొనుగోలు చేసిన కోల్‌కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్‌లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్‌లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతేడాది పహల్గామ్? ఉగ్రగాడికి నిరసనగా ఆసియా కప్?లో భారత సీనియర్ క్రికెటర్లు పాకిస్థాన్?తో కరచాలనం చేయలేదు. ఆ టోర్నీలో పాక్?తో మూడుసార్లు భారత్ తలపడగా, మూడుసార్లు కూడా మన ప్లేయర్లు దాయాది జట్టు ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. ఫైనల్‌లో నెగ్గిన తర్వాత కూడా పాకిస్థాన్?కు చెందిన మోసిన్ నఖ్వీ చేతిలమీదుగా ట్రోఫీని అందుకునేందుకు టీమ్‌ఇండియా నిరాకరించింది. దీంతో నఖ్వీ ఈ ట్రోఫీని తనతోపాటు తీసుకెళ్లాడు. ఆ ట్రోఫీ ఇంకా భారత్?కు అందలేదు. ప్రస్తుతం దీనిపై కూడా కాంట్రవర్సీ నడుస్తోంది. 2025 మహిళల వన్డే వరల్డ్?కప్?లో భారత్- పాకిస్థాన్ మధ్య మ్యాచ్?లోనూ ఇదే పునరావృతం అయ్యింది. పురుషుల క్రికెట్?లోలాగే మహిళలు కూడా పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. టాస్ సమయంలోగానీ, మ్యాచ్? ముగిసిన తర్వాతగానీ టీమ్‌ఇండియా ప్లేయర్లు పాకిస్థాన్ క్రీడాకారిణులతో కరచాలనం చేయలేదు. ఇదే పాలసీని ఇప్పుడు యువ భారత జట్టు కూడా కొనసాగించింది.తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. అభిజ్ఞాన్ కుందు (80; 112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. కనిష్క్ చౌహాన్ (28) ఫర్వాలేదనిపించాడు. ఆయుష్ మాత్రే (6), వేదాంత్ త్రివేది (0) నిరాశపర్చడంతో ఆరంభంలోనే భారత్ 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహద్ 5, ఇక్బాల్ 2, హకీమ్ తమీమ్ 2, పావెజ్ జిబోన్ ఒక వికెట్ పడగొట్టారు.



## చిత్తుగా ఓడిన ముంబై ఇండియన్స్!

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు మరో ఘోర పరాజయం ఎదురైంది. యూపీ వారియర్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. యూపీ కెప్టెన్ మెగ్‌లాన్నింగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. మెగ్ లాన్నింగ్(45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 70), ఫోబే లిట్చ్‌ఫీల్డ్(37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో నాట్ సివర్ బ్రంట్ రెండు వికెట్లు తీయగా.. అమెలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టింది. నికోలా కేరీ, హీలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసి ఓటమిపాలైంది. అమెలియా కేర్(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్(24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 41 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లో శిఖా పాండే(2/30) రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, సోఫీ ఎక్లెస్టోన్, దీప్తి శర్మ, చోలే ట్రయాన్ తలో వికెట్ తీసారు. లక్ష్యచేధనలో ముంబై బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు హీలీ మాథ్యూస్(13), సజీవన్ సజన(10) నిరాశపర్చారు. దాంతో ముంబై పవర్ ప్లేలో 2 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఆ వెంటనే నాట్ సివర్ బ్రంట్‌ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. నికోలా కేరిని దీప్తి శర్మ ఔట్ చేయగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(18) ట్రయన్ వెనక్కి పంపింది. దాంతో ముంబై 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో అమెలియా కేర్, అమన్‌జోత్ కౌర్ పోరాడారు. కానీ ఛేజింగ్ రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ముంబైకి ఇది మూడో పరాజయం. రెండు సార్లు యూపీ వారియర్స్ చేతిలోనే ఓడటం గమనార్హం.

## యువరాజ్, లారా నా ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు

### టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ



టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. టీమిండియా క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేర్లు కాకుండా ఇతర పేర్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా ఒకరి పేరు కాకుండా ఈ 14 ఏళ్ల కుర్రాడు ఇద్దరు ఆటగాళ్లు తన ఆల్‌టైమ్ ఫేవరేట్ అని పేర్కొన్నాడు. ఇందులో ఒకరు భారత ఆటగాడు ఉండగా.. మరొకరు విదేశీ ప్లేయర్ ఉన్నాడు. ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం ప్రతీ ప్లేయర్ తమను తాము పరిచయం చేసుకోవాల్సి ఉంటుంది. తమ బ్యాటింగ్, బౌలింగ్ శైలితో పాటు ఫేవరేట్ క్రికెటర్ల పేరు చెప్పాలి. అంతేకాకుండా బ్యాటర్లు అయితే తమ ఫేవరేట్ షాట్, బౌలర్లు అయితే తమ ఫేవరేట్ బాల్ ఏంటో తెలియజేయాలి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రతీ మ్యాచ్‌అబశ్రీశ్రీలో ప్లే చేస్తుంటారు. బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత బ్యాటర్ల వీడియోలు.. బౌలింగ్ చేస్తున్న బౌలర్ల వీడియోలను చూపిస్తారు. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ ప్లేయర్ల పేర్లు వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా తమ ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు అని చెప్పుకొచ్చాడు. తనకు పుల్ షాట్ అంటే చాలా ఇష్టమని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. జనవరి 15(గురువారం)న ప్రారంభమైన అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్.. తమ తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(2) విఫలమైనా.. భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ద్వారా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అతి పిన్న భారత ప్లేయర్‌గా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు.

## వెక్కిరించబోయి వికెట్ పారేసుకున్న పాక్ క్రికెటర్

పాకిస్థాన్ క్రికెటర్లకు ఈ మధ్య కాలం అస్సలు కలిసి రావడం లేదు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ నుంచి బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ వరకు ఎక్కడ చూసినా పాక్ ఆటగాళ్లకు అవమానాలే ఎదురవుతున్నాయి. తాజాగా బంగ్లాదేశ్ లీగ్‌లో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ చేసిన ఓ అత్యుత్సాహం ఇప్పుడు సోషల్ మీడియాలో నవ్వులపాలు చేస్తోంది. బౌలర్‌ను వెక్కిరించబోయి తనే బలికావడమే కాకుండా, ప్రత్యర్థి బౌలర్ చేతిలో ఘోరమైన అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రాజ్‌షాహి వారియర్స్ తరపున ఆడుతున్న సాహిబ్జాదా ఫర్హాన్, సిల్హెట్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వింతగా ప్రవర్తించాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో బంగ్లాదేశ్ బౌలర్ రుయెల్ మియా వేసిన బంతిని ఫర్హాన్ డిఫెండ్ చేశాడు. బంతి బౌలర్ దగ్గరకు వెళ్లగానే, ఫర్హాన్ తన చేతిని ముఖం ముందుకు తెచ్చి హాలీవుడ్ రెజ్లర్ జాన్ సీనా స్టైల్లో యు కాంట్ సీ మీ అంటూ బౌలర్‌ను వెక్కిరించాడు. తనేదో తోపు బ్యాటర్ లాగా బౌలర్‌ను కించపరిచేలా ప్రవర్తించడం స్టేడియంలో ఉన్న వారందరినీ ఆశ్చర్యపరిచింది. ఫర్హాన్ చేసిన ఈ వెటకారానికి రుయెల్ మియా సరైన సమాధానం ఇచ్చాడు. మరుసటి బంతికే ఫర్హాన్ భారీ షాట్ కొట్టబోయి షార్ట్ థర్డ్ మ్యాన్ ఫీల్డర్ కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కేవలం 12 బంతుల్లో 14 పరుగులు చేసిన ఫర్హాన్, తల పట్టుకుని పెవిలియన్ వైపు నడిచాడు. అయితే ఇక్కడ అసలైన ట్విస్ట్ బౌలర్ సెలబ్రేషన్. వికెట్ తీసిన రుయెల్ మియా, దూకుడుగా ప్రవర్తించకుండా టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ ఫేమస్ స్టైల్లో మైదానంలో పడుకుని వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కేవలం ఫర్హాన్ మాత్రమే కాదు, ఇతర పాక్ స్టార్లు కూడా విదేశీ లీగ్ లలో విమర్శల పాలవుతున్నారు. బిగ్ బాష్ లీగ్‌లో షాహీన్ అఫ్రిదీ ఒకే ఓవర్‌లో రెండు బీమర్లు వేసి బౌలింగ్ నుంచి నిషేధానికి గురయ్యాడు. అటు మహ్మద్ రిజ్వాన్ నెమ్మదిగా ఆడుతున్నాడని కెప్టెన్ అతడిని రిటైర్డ్ అవుట్ చేయగా, బాబర్ ఆజంకు సింగిల్ ఇచ్చేందుకు స్టీవ్ స్మిత్ నిరాకరించడం పెద్ద దుమారం రేపింది. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన, వారి ఆటతీరు చూస్తుంటే.. "తినడం, పడుకోవడం, అవమానపడటం.. మళ్ళీ రిపీట్ చేయడం" అన్నట్లుగా మారిపోయిందని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

# మన శంకరవరప్రసాద్ గారు

## రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు

టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది. తాజాగా ఐదు రోజుల కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది ఒక ప్రాంతీయ సినిమాకు ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొంటూ స్పెషల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు.నిర్మాతల ప్రకటనలో 'ప్రతి మార్కెట్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు' డామినేషన్ కొనసాగుతోంది. మెగా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.226 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇది రీజినల్ సినిమా చరిత్రలో అరుదైన ఘట్టం' అని పేర్కొన్నారు. వీకెండ్ మొత్తం సినిమా ట్రెండ్ కొనసాగుతుందని కూడా వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటించగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించారు. వీటీవీ గణేష్, యూట్యూబర్ నందన తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.






# ప్రభాస్ స్పిరిట్‌కు డేట్ ఫిక్స్

## 2027 మార్చి5న విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్,సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి, గత కొన్ని రోజులుగా ఈ చిత్రం 2027 సంక్రాంతి బరిలో నిలుస్తుందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ విడుదల తేదీపై చిత్ర యూనిట్ క్లారిటీనిస్తూ ఒక కీలక ప్రకటన చేసింది, అందరూ ఊహించినట్లుగా సంక్రాంతికి కాకుండా, ఈ చిత్రం 2027, మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి రేసు నుండి తప్పుకున్నప్పటికీ, మార్చి 5న విడుదల కావడం వల్ల ఈ సినిమాకు లాంగ్ సమ్మర్ సీజన్ ప్లస్ పాయింట్‌గా మారనుంది, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ కనిపించనున్న ఈ సినిమా కోసం సందీప్ రెడ్డి వంగా ఒక విభిన్నమైన, రా యాక్షన్ డ్రామాను సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్లో మొదటిసారిగా ఒక సీరియస్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ప్రభాస్ సరసన తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో మెరవనున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత వంగా తీస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్ మార్కెట్ ఈ చిత్రంపై కన్నేసింది, అధికారిక విడుదల తేదీ వెల్లడి కావడంతో ప్రభాస్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'సౌండ్ స్టోరీ' టీజర్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.



# హిట్టు కొట్టి చూపించా

## వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా: శర్వానంద్

'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుందని అన్నారు నిర్మాత దిల్‌రాజు.

# మరో భిన్నమైన కథతో ధనుష్.. కర మూవీ




రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు.గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మ-రోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# తెలుగమ్మాయి గ్లామర్ షో తగ్గేదేలే!

రాజ్ అండ్ డీకే చాలామంది జీవితాలను మార్చారు. ఈ ట్యాలెంటెడ్ దర్శకరచయితలు చాలామంది తెలుగు నటులు, నటీమణులకు తమ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో అవకాశాల్ని కల్పించారు. అలా అవకాశం అందుకున్న ఒక తెలుగమ్మాయి శ్రేయా ధన్వంతరి. సమంత రూత్ ప్రభు కంటే ముందే రాజ్ అండ్ డీకే శ్రేయాకు తమ వెబ్ సిరీస్ లో అవకాశాలు కల్పించారు. శ్రేయా ఇటీవల ముంబైలో పాపులర్ అవ్వడానికి వరుస అవకాశాలు అందుకోవడానికి అవసరమైన సాయం చేసింది రాజ్ అండ్ డీకే. శ్రేయా ధన్వంతరి గ్లామర్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపుతో ఎదగాలనుకుంటున్న తెలుగమ్మాయి. మధురా శ్రీధర్ 'స్నేహగీతం' చిత్రంతో నటిగా కెరీర్ ప్రారంభించింది. మోడల్ గా, రచయిత్రిగా శ్రేయా రాణించారు. ముఖ్యంగా ఓటీటీ రంగంలో రాణించిన శ్రేయా, ఎంపిక చేసుకున్న పాత్రలు స్టార్‌గా నిలబెట్టాయి. శ్రేయా నేపథ్యం పరిశీలిస్తే 29 ఆగస్టు 1988న హైదరాబాద్‌లో జన్మించారు. తన తల్లి తెలుగు వారు.. తండ్రి హిందీ భాష మాట్లాడే వ్యక్తి. ఏవియేషన్ రంగంలో పని చేస్తున్నారు. దీంతో శ్రేయా పుట్టిన రెండు నెలలకే తండ్రి ఉద్యోగ రీత్యా వారి కుటుంబం మిడిల్ ఈస్ట్ కి వెళ్లిపోయింది. శ్రేయా తన బాల్యాన్ని దుబాయ్, బహ్రెయిన్, ఖతార్‌లలో గడిపారు. దాదాపు 17దేశాలలో తన తండ్రి ఉద్యోగం చేసారని వెల్లడించారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం తిరిగి భారత్‌కు వచ్చిన శ్రేయా వరంగల్‌లోని ప్రతిష్టాత్మకమైన ఎన్.ఐ.టి-ఓరుగల్లు నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతుండగానే 'ఫెమినా మిస్ ఇండియా సౌత్ 2008' పోటీలలో పాల్గొని ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. అనంతరం మిస్ ఇండియా 2008 ఫైనలిస్ట్‌గా నిలిచారు. 2009లో అక్కినేని నాగచైతన్య మొదటి సినిమా 'జోష్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 2010లో 'స్నేహగీతం' సినిమాలో శైలు అనే ప్రధాన పాత్రలో నటించి మెప్పించారు.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# చిట్టత్తూరులో వైభవంగా శ్రీరామచంద్రమూర్తి గ్రామోత్సవం



- గ్రామ దేవత శ్రీ నాగాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**నేటి సాక్షి తిరుపతి, రామచంద్రపురం:** మండలంలోని చిట్టత్తూరు కాళేపల్లి పంచాయతీ చిట్టత్తూరు గ్రామంలో శ్రీ సీతా లక్ష్మీన సమేత శ్రీరామచంద్రమూర్తి రథోత్సవంలో గరుడ వాహనంపై గ్రామ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గత నెల రోజులుగా ధనుర్మాసం సందర్భంగా గ్రామస్తులు ప్రతి ఒక్క ఇంటి వారు గ్రామంలో వెలిసి ఉన్న పురాతన ఆలయమైన శ్రీరామ మందిరంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి చక్కెర పొంగలి, దద్దోజనం, కారప్పొంగలి పలు రకాల ప్రసాదాలతో నైవేద్యాలు సమర్పించి తమ గ్రామాన్ని శ్రీరామరక్షగా కాపాడాలని నెల రోజులు పాటు గ్రామస్తులు పూజలు చేస్తారు. ధనుర్మాసం చివరి రోజు ప్రతి ఇంటి దగ్గర వెళ్లి ప్రసాద సామాగ్రిని సేకరించి సాయంత్రం శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తికి, శ్రీ ఆంజనేయ స్వామికి, శ్రీ గరుడ అల్వార కు ప్రత్యేక పూజలు చేసి వైభవంగా శ్రీ గరుడ వాహనంపై దేవతా దేవరులను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు. ప్రతి ఇంటి దగ్గర మహిళలు వారి ఇంటి వద్దకు వచ్చిన దేవతా దేవరులకు కర్పూర హారతులు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకుంటారు. ముఖ్యంగా గ్రామదేవత శ్రీ నాగాలమ్మ తల్లికి అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి పసుపు కుంకుమ చీరా సమర్పించి దీప దూప నైవేద్యాలతో కొబ్బరికాయలు కొట్టి పుట్టలో పాలు పోసి రావి చెట్టుకు ప్రదక్షణ చేసి మొక్కలు తీర్చుకుంటారు సంక్రాంతి సందర్భంగా జరిగే ఈ ఉత్సవంలో యువత ప్రత్యేక ఆకర్షణగా సంబరాలు జరుపుకుంటారు. స్వామివారు ఊరేగింపు సమయంలో భజనలు కోలాటాలతో శ్రీరామనామ స్మరణతో గ్రామంలో భక్తి భావం విరసిల్లుతుంది.

# మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ



**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్:** జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మున్సిపల్ వార్డుల రిజర్వేషన్ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ వార్డుల వారీగా రిజర్వేషన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డులకు డెడికేషన్ కమిషన్ కేటాయింపు ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ నిర్వహించడం జరిగిందని తెలిపారు. మహిళలకు కేటాయించిన వార్డులను లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని, షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, జనరల్ మహిళలకు 50 శాతం సీట్లను మహిళలకు కేటాయించడం జరిగిందని తెలిపారు. రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# క్రీడాకారులకు బహుమతి ప్రధానం



**నేటి సాక్షి,నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని మందిపల్లిలో ప్రీమియర్ లీగ్‌లో విజేతలుగా నిలిచిన భీమ్ వారియర్స్ జట్టును ఉప సర్పంచ్ నరేష్, (డీస్పీ మండల అధ్యక్షులు),జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, మాజీ సర్పంచ్ కనకం వెంకటయ్య,3, 8, 10 వార్డు సభ్యులు కలిసి సన్మానించడం జరిగింది. బొల్లి శ్రీనివాసులు తన తరఫున రూ,1100 నగదు బహుమతిని జట్టుకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్, నరేష్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, ఆటగాళ్లకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. క్రీడల ద్వారా గ్రామానికి మంచి పేరు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఇండ్లను కాపాడండి



- ఎస్సారెస్పీ భూముల పరిరక్షణలో వివక్ష వద్దు
- అధికారుల తీరు ఏకపక్షం
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారా
- బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం
- మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి

**నేటి సాక్షి,నల్లబెల్లి, :**ఎస్సారెస్పీ భూముల పరిరక్షణ పేరుతో ఇరిగేషన్ అధికారులు అనుసరిస్తున్న తీరు అన్యాయమని, ఒకే గ్రామాన్ని లక్ష్యంగా చేసుకోవడం వెనుక రాజకీయ కుట్రలు దాగి ఉన్నాయని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి విమర్శించారు. శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీసుకొండ నుంచి భూపాలపల్లి వరకు విస్తరించి ఉన్న ఎస్సారెస్పీ డి.బి.ఎం-38 కెనాల్‌కు సంబంధించి హద్దుల నిర్ణయంలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సారంగపాణి ఆరోపించారు. కెనాల్ ప్రారంభం నుంచి చివరి వరకు కాకుండా, కేవలం నల్లబెల్లి గ్రామానికే పరిమితమై హద్దులు కేటాయించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం కెనాల్‌కు రెండు వైపులా శాస్త్రీయంగా హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పట్టా భూములు కలిగిన రైతులను, ఏళ్ల తరబడి నివసిస్తున్న సామాన్యులను నోటీసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు.మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామమైన నల్లబెల్లిలోనే ఈ తరహా చర్యలు చేపట్టడం చూస్తుంటే ఇది పక్కా రాజకీయ ప్రేరేపిత చర్యగా కనిపిస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేయడం వెనుక ఉన్న రాజకీయ ఒత్తిళ్లపై అధికారులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు.కాలువ భూముల పరిరక్షణకు తమ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, అయితే నిబంధనల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడితే సహించేది లేదని స్పష్టం చేశారు. పట్టాదారుల నుంచి భూములు కొనుగోలు చేసి నష్టపోతున్న బాధితులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఉడుగుల ప్రవీణ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గందె శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎంపీటీసీ జన్నుజయరావు, మాజీ సర్పంచ్ గుండాల కుమార స్వామి, సర్పంచ్‌లు నాగెళ్ళి జ్యోతి ప్రకాష్, పులి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్, ఉప సర్పంచ్ గుమ్మడి వేణు, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో పూరి గుడిసె దగ్ధం

రూ లక్ష ఆస్తి నష్టం





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** షార్ట్ సర్క్యూట్తో పూరిగుడి దగ్ధమైన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలు కథనం మేరకు... చౌడేపల్లి మండలం కాగతి పంచాయతీ పలగార్లపల్లికి చెందిన రెడ్డమ్మ పూరి గుడిసెలో నివసిస్తోంది. ఈ క్రమంలో తన కుటుంబంలో వ్యక్తి గుడిసెలో లాప్టాప్ కు కరెంటు నుంచి ఛార్జింగ్ పెట్టుకున్నాడు .శుక్రవారం అర్ధరాత్రి సమయంలో లాప్టాప్ చార్జింగ్ వైరులో ఏర్పడ్డ విద్యుత్ షార్ట్యూట్ మూలంగా గుడిసెకు నిప్పంటుకుంది. ఆ సమయంలో గ్రామంలో పండుగ ఉండడంతో గుడిసె నుంచి మంటలు చెలరేగడం గుర్తించిన స్థానికులు మంటలను అదుపులోకి తెచ్చారు ఆలోపే ఇంట్లో ఉన్న రూ. 50వేలు లాప్టాప్ పూర్తిగా కాలిపోయాయి. అంతేకాకుండా నిత్యవసర సరుకులు ఖాళీ అయినట్లు బాధితురాలు రెడ్డమ్మ వాపొయింది ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారుగువ్వల రమేష్ రెడ్డిచే ఆర్థిక సాయం, విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి నిరుపేద రెడ్డమ్మకు ఆర్థిక సాయం అందించారు. ఆయన అనుచరులు నాగరాజు రెడ్డి. గంగాధర్ గంగరాజు. తదితరులు బాధితురాలకు నగదును అందించారు

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి



నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది .ఎస్సై నాగేశ్వరరావు కథ మేరకు... చౌడేపల్లి తిరుపతి ప్రధాన రహదారి .సింగిరిగుంట బస్సు స్టేజికి కొంత దూరంలో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడిన సమాచారం అందింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గుర్తుతెలియని వ్యక్తిని అదేవిధంగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ట్లుగా తెలుసుకొని గాయపడ్డ వ్యక్తిని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి యొక్క ఫోటో సోషల్ మీడియాలో హల్చల్ కావడంతో సదరు వ్యక్తి చౌడేపల్లి మండలం పంచాయతీ కేంద్రం పరికిదొన కొమ్ము శ్రీనివాసులు 52 గా గుర్తించారు. గాయపడ్డ వ్యక్తి మరణించడంతో మృతుని భార్య ఓబులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అక్కడే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు

# ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్



**నేటి సాక్షి మెట్‌పల్లి:** మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాయత్రి బ్యాంకు మెట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారునికి సంబంధించిన ప్రమాద ఇన్సూరెన్స్ చెక్కును కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. గాయత్రి బ్యాంకు మెట్‌పల్లి శాఖ ఖాతాదారుడు, సత్తక్కపల్లి గ్రామానికి చెందిన పాతూరి శివరామకృష్ణ కొన్ని నెలల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో గాయత్రి బ్యాంకు అమలు చేస్తున్న “గాయత్రి నిర్భయ సేవింగ్స్” పథకం ద్వారా ప్రతి ఖాతాదారునికి అందించే రూ.1,00,000/- ప్రమాద ఇన్సూరెన్స్ సౌకర్యం మేరకు, ఆయన నామినీ అయిన అమ్మ పాతూరి శ్రీలతకి ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే డా. సంజయ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించే ఇటువంటి పథకాలు అత్యంత అవసరమని, గాయత్రి బ్యాంకు ఖాతాదారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అభినందించారు. ప్రమాదాల వంటి అనూహ్య పరిస్థితుల్లో కుటుంబాలకు ఈ తరహా ఇన్సూరెన్స్ ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మొగిలిపేటలో Arrive Alive అవగాహన కార్యక్రమం

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



**నేటి సాక్షి మెట్‌పల్లి:** మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో Arrive Alive అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్‌కు అలవాటు పడి కుటుంబాలకు దూరం కావద్దని, జీవితాన్ని నాశనం చేసుకునే అలవాట్లకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, హెల్మెట్ ధరించి మాత్రమే ప్రయాణం చేయాలని గ్రామస్తులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ అనిల్ కుమార్, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది జువ్వాడి కృష్ణారావు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమం ద్వారా యువతలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

నేటి సాక్షి TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 18 జనవరి 2026

# కన్మనూరు గ్రామంలో స్వచ్ఛభారత్

**శుభ్రత పాటించాలి...**

**గ్రామ సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్....**



**నేటి సాక్షి, నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని కన్మనూర్ గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ అంకిత సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వార్డులలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంకిత సురేంద్ర గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వార్డులలో చెత్తాచెదారాన్ని తొలగించి, శుభ్రత పాటించాలని ఆమె గ్రామస్తులను కోరారు. వార్డులు శుభ్రత ఉంటేనే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని గ్రామస్తులు సహకరించాలని ఆమె కోరారు. ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కన్మనూరు గ్రామ వార్డు సభ్యులు రమేషు రాము సందీప్ గ్రామస్తులు గణేష్ రెడ్డి నర్సింలు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**ముగ్గురికి సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత**

**ఎమ్మెల్యే కోవ లక్ష్మి**



**నేటి సాక్షి, కొమరం భీమ్ ఆసిఫాబాద్ :** తిర్యాణి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు 'కళ్యాణ లక్ష్మి' పథకం కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ముగ్గురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని, అలాగే అత్యవసర పరిస్థితుల్లో సీఎం సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు మద్దతు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీశ్, నూతన ప్రజాప్రతినిధులు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చుంచు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల, మాజీ ఎంపీపీ మర్సకోల శ్రీదేవి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రం తనిఖీ



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ లోకనాథం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముఖ్యంగా 104 -108 వాహనాలను తనిఖీ చేసి వాటిలో గల సామర్థ్యాన్ని పలు విషయాలను పైలట్లను అడిగి తెలుసుకున్నారు .అదేవిధంగా ఆరోగ్య కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను గురించి ఏఎన్ఎం లకు వివరించారు 70 ఏళ్లకు పైబడి ఉన్న వృద్ధులను కార్యక్రమంలో భాగస్వాములు చేయాలన్నారు .అనంతరం పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# క్రికెట్ ఆడుతూ యువకుడి మృతి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** క్రికెట్ ఆడుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది .మండలంలోని వెంగళపల్లి పంచాయతీ పెద్దూరుకు చెందిన సహదేవ రెడ్డి కుమారుడు. తేజ 22 గ్రామానికి సమీపంలోని పాలెంపల్లి వద్ద క్రికెట్ టోర్నమెంట్ కు వెళ్ళాడు అక్కడ ఫీల్డింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలాడు సహచరులు వెంటనే అతన్ని చౌడేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరుకు సిఫారసు చేశారు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు

# మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్....




- **మున్సిపల్ చైర్మన్ గా "జనరల్ మహిళ" కు కేటాయిస్తూ రిజర్వేషన్ ఖరారు....**

**నేటిసాక్షి, మిర్యాలగూడ :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికలకు మొత్తం 1నుండి 48 వార్డులకు రిజర్వేషన్ల వివరాలు శనివారం వెల్లడించారు. మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్‌గా జనరల్ మహిళకు కేటాయిస్తూ రిజర్వేషన్‌ఖరారు చేసినట్లు సమాచారం. రిజర్వేషన్లు ఖరారు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, బీఎస్పీ, వివిధ పార్టీల నేతలు, స్వతంత్ర అభ్యర్థులు సైతం ఎన్నికలకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో మిర్యాలగూడ మున్సిపల్‌పీఠం మరి ఎవ్వరికీ చేరుతుందో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**వార్డుల వారిగా రిజర్వేషన్లు.**

1 వార్డ్ బీసీ మహిళ..
2 వార్డ్ జనరల్ మహిళ.
3 వార్డు జనరల్ మహిళ..
4వార్డు జనరల్..
5 వార్డు ఎస్టీ మహిళ
6 వార్డు ఎస్టీ జనరల్..
7 వార్డు జనరల్ మహిళ..
8 వార్డు జనరల్ ..
9 వార్డు ఎస్సీ జనరల్..
10 వార్డు బీసీ మహిళ..
11 వార్డు ఎస్సీ జనరల్..
12 వార్డు జనరల్ మహిళ
13 వార్డు జనరల్ ..
14 వార్డు జనరల్..
15 వార్డు ఎస్సీ మహిళ..
16 వార్డు ఎస్సీ మహిళ..
17) జనరల్ మహిళ
18 వార్డు ఎస్సీ జనరల్..
19 వార్డు బీసీ జనరల్..
20 వార్డు జనరల్ మహిళ..
21 వార్డు బీసీ మహిళ..
22 వార్డు బీసీ జనరల్..
23 వార్డు బీసీ జనరల్..
24 వార్డు బీసీ మహిళ..
25 వార్డ్ ఎస్టి జనరల్..
26 వార్డ్ బీసీ జనరల్..
27 వార్డు జనరల్ మహిళ..
28 వార్డు జనరల్..
29 వార్డు జనరల్..
30 వార్డు బీసీ మహిళ..
31 వార్డు బీసీ మహిళ..
32 వార్డు జనరల్..
33 వార్డు జనరల్ మహిళ..
34 వార్డు జనరల్ మహిళ..
35 వార్డు జనరల్..
36 వార్డు బీసీ మహిళ..
37 వార్డ్ బీసీ జనరల్..
38 వార్డు జనరల్ మహిళ..
39 వార్డు జనరల్..
40 వార్డు జనరల్..
41వార్డు జనరల్ మహిళ..
42 వార్డు బీసీ మహిళ..
43 వార్డు జనరల్ మహిళ..
44 వార్డ్ జనరల్..
45 వార్డు బీసీ జనరల్..
46 వార్డు బీసీ జనరల్..
47 వార్డు బీసీ జనరల్..
48 వార్డ్ జనరల్ మహిళ.

# ఎల్లమ్మ తల్లి సంక్రాంతి మహోత్సవాలు...

- **తిరుమల తిరుపతి దేవస్థానం పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు...**
- **సాయంత్రం కొండచుట్టు మహోత్సవానికి సర్వం సిద్ధం...**



**నేటి సాక్షి తిరుపతి చంద్రగిరి:** చంద్రగిరి పట్టణ ప్రజల ఆరాధ్య దైవం, సత్య ప్రమాణాలకు నిలయమైన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు పట్టణంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన 'కొండచుట్టు మహోత్సవం' భక్తుల కోలాహలం నడుమ అత్యంత వైభవంగా జరగనుంది. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించే కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ పట్టువస్త్రాల ఊరేగింపు స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయం నుండి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నాని (వెంకటమణి ప్రసాద్) సతీమణి పులివర్తి సుధారెడ్డి తో కలిసి తొలుత కోదండరామస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం ఎమ్మెల్యేకు శేష వస్త్రంతో తలపాగా చుట్టి, అమ్మవారి పట్టువస్త్రాలను అందజేశారు. అక్కడి నుండి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, మరియు మహిళల కోలాటాల నడుమ పట్టువస్త్రాలను తలపై ధరించి ఎమ్మెల్యే దంపతులు ఊరేగింపుగా శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా భక్తులు అమ్మవారికి, ఎమ్మెల్యే దంపతులకు ఘనస్వాగతం పలికారు.

**అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ**

ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ చైర్మన్, ఈఓ, కమిటీ సభ్యులు, అర్చకులు ఎదురేగి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించిన అనంతరం, దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేద పండితులు వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు.

**కొండ చుట్టూ మహోత్సవానికి ఆహ్వానం**

ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ... చంద్రగిరి గ్రామదేవత, సత్య ప్రమాణాలకు నిలయమైన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లికి సంక్రాంతి పండుగ వేళ పట్టువస్త్రాలు సమర్పించే భాగ్యం కలగడం నా పూర్వజన్మ సుకృతం. అమ్మవారికి ఈ సేవ చేయడం నాకు ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చింది" అని హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సాయంత్రం 4:00 గంటలకు ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'కొండచుట్టు మహోత్సవం' ప్రారంభం కానుంది. ఈ విశేష వేడుకలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు, స్థానిక కూటమి నేతలు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# కాగజ్‌నగర్ మున్సిపాలిటీ వార్డు రిజర్వేషన్లు

**నేటి సాక్షి కొమురం భీం ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్ మున్సిపాలిటీ వార్డు రిజర్వేషన్లు విడుదల జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే పర్యవేక్షణలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డు రిజర్వేషన్లను అధికారికంగా విడుదల చేశారు. ఈ ప్రక్రియతో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 30 వార్డులకు గాను రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డు రిజర్వేషన్లు ఖరారు కావడంతో రాజకీయ పార్టీలతో పాటు ఆశావహ అభ్యర్థుల్లో ఎన్నికల సందడి మొదలైంది. త్వరలోనే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

**వార్డు వారీగా రిజర్వేషన్లు (సీరియల్ క్రమంలో):**

1వ వార్డు - బీసీ (మహిళ)
2వ వార్డు - ఎస్సీ
3వ వార్డు - బీసీ (మహిళ)
4వ వార్డు - బీసీ (మహిళ)
5వ వార్డు - జనరల్
6వ వార్డు - జనరల్ (మహిళ)
7వ వార్డు - జనరల్ (మహిళ)
8వ వార్డు - జనరల్ (మహిళ)
9వ వార్డు - జనరల్
10వ వార్డు - జనరల్
11వ వార్డు - జనరల్
12వ వార్డు - ఎస్సీ (మహిళ)
13వ వార్డు - బీసీ (మహిళ)
14వ వార్డు - జనరల్ (మహిళ)
15వ వార్డు - బీసీ
16వ వార్డు - బీసీ
17వ వార్డు - బీసీ
18వ వార్డు - జనరల్ (మహిళ)
19వ వార్డు - ఎస్సీ (మహిళ)
20వ వార్డు - జనరల్ (మహిళ)
21వ వార్డు - జనరల్ (మహిళ)
22వ వార్డు - బీసీ
23వ వార్డు - జనరల్ (మహిళ)
24వ వార్డు - జనరల్
25వ వార్డు - ఎస్సీ
26వ వార్డు - జనరల్
27వ వార్డు - జనరల్ (మహిళ)
28వ వార్డు - ఎస్సీ
29వ వార్డు - బీసీ
30వ వార్డు - ఎస్టీ

# శనీశ్వర స్వామికి ప్రదక్షిణలు అత్యంత ప్రీతికరం

- **శ్రీ ఉంగరాల సుబ్రమణ్య శర్మ**
- **అన్న దాతలుగా శ్రీమతి సీ.వి కృష్ణవేణమ్మ శేషాద్రి దంపతులు**



**నేటి సాక్షి తిరుపతి, రామచంద్రపురం:**రామచంద్రపురం మండలం రాయల చెరువు పంచాయతీ చాయాపురంలో వెలిసి ఉన్న శ్రీ ఛాయామార్తాండ శ్రీ శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని ప్రాతః కాలంలో సుప్రభాతం సేవతో మేల్కొల్పారు. అనంతరం ఉదయం ఏడు గంటలకు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తైలాభిషేకం చేశారు. తదుపరి పాలు పెరుగు నెయ్యి పంచామృతం సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ శాస్త్రుత్తంగా శని నివారణ, శాంతి హోమం, గణపతి హోమం, నవగ్రహ శాంతి నివారణ హోమం చేయించారు. ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న అభయ హస్త ఆంజనేయస్వామికి తమలపాకలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులచే గోపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని ప్రభావం కలిగి ఉన్న భక్తులు అష్టమ శని, అర్ధాష్టమ శని, ఏనాటి శని, శాంతి హోమం, నవగ్రహ దోష నివారణ హోమం, గణపతి హోమం, చండీ హోమం వారి వారి గ్రహ స్థితులను అనుసరించి ప్రతి శనివారం ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా శ్రీ శనీశ్వర స్వామి వారికి 19 ప్రదక్షిణలు, 19సార్లు నామస్మరణ, అత్యంత ప్రీతికరమని, శని దశ 19 సంవత్సరాలు జీవిత కాలంలో ఉంటుందని, ఆ సమయంలో మనం చేసే ప్రతి కార్యము పుణ్యదాయకమై ఉండాలని, కర్మఫల దాత శనీశ్వరుని అత్యంత పుణ్యకాలమని తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కర్ణాటక రాష్ట్రం సింగనవల్లి ప్రాంతానికి చెందిన ఆలయ అర్చకులు శ్రీమతి సీ. వి.కృష్ణవేణమ్మ శేషాద్రి దంపతులు అన్నదాన వితరణ చేశారు. మధ్యాహ్నం భక్తి భజన కార్యక్రమాలు నిర్వహించారు



# మాస్ కా దాస్!

## మన 'గంధం గంగాధర్ భేష్!

### హమాలీ నుంచి ఆటో డ్రైవర్‌గా ప్రయాణం మొదలు



- ఆటో టు కౌన్సిలర్‌గా 'పొలిటికల్ ఎంట్రీ'
- వార్డు ప్రజలకు ఆయనో 'ఆపద్భాంధవుడు'
- అభివృద్ధి కోసమైనా.. ఆపదలో ఆదుకునేందుకైనా.. ఎనీ టైం రెడీ
- సాధారణ జీవితం నుంచి సమాజసేవకుడిగా జర్నీ చేస్తున్న 'గంధం గంగాధర్ సక్సెస్ స్టోరీ



అతనొక సాధారణ హమాలీ.! కుటుంబ పోషణ కోసం హమాలిగా తన వ్యక్తిగత జీవితాన్ని ఆరంభించిన ఆయన సమాజసేవకుడిగా తనను తాను మార్చుకున్నారు. తన వార్డు ప్రజల్లో తలలో నాలుకలా నిలిచిపోయారు. హమాలీ పని నుండి ఆటో డ్రైవర్‌గా మారి.. తన వార్డు అభివృద్ధి కోసం రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన, నాలుగైదు ఏండ్లుగా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో తనను తాను నిమగ్నం చేసుకున్నారు. ఆపదలో ఆదుకునే 'ఆపద్బాంధవుడు'గా పేరున్న గంగాధర్, తన వార్డును అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. 2020 మున్సిపాల్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) తరఫున ఎస్సీ (జనరల్) సీటుపై విజయం సాధించిన ఆయన, ఇప్పుడు జనరల్ కేటగిరీలో ప్రజల మనసు గెలుచుకోవడానికి మరోసారి బరిలోకి దిగి ప్రజాసేవలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు.

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

### శ్రమ జీవితం నుండి సమాజ సేవకు మార్గం

చిన్న కుటుంబం నుంచి వచ్చిన గంధం గంగాధర్ జీవితం సాధారణ మనిషి ఆకాంక్షలు, కష్టాలు, సాధనలతో నిండినది. హమాలీ పని చేస్తూ మొదలైన ఆయన ప్రయాణం, కష్టపడి ఆటో కొనుక్కుని డ్రైవర్‌గా మారడంతో మరింత బలపడింది. కొన్ని సంవత్సరాలు ఆటోలో ప్రయాణికులను చేరవేస్తూ, తన పిల్లలను స్కూలుకు పంపి, కిరాయి జీవితాన్ని సాగించారు. వార్డులో 15 సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి జరగకపోవడం, స్థానిక నాయకులు ఏమీ చేయకపోవడం చూసి, ఆయనలో మార్పు వచ్చింది. తన వార్డును అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలో, ఆయన సాధారణ జీవితాన్ని వదిలి, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తనను అంకితం చేసుకున్నారు. చిన్న పని అయినా, పెద్ద సమస్య అయినా, అధికారుల దగ్గరికి వెళ్లి పరిష్కరించడం ఆయనకు అలవాటుగా మారింది.



## ప్రజల కోసం రాజకీయ ప్రవేశం

### ప్రజల కోసం త్యాగం చేసిన నాలుగు సంవత్సరాలు

రాజకీయాల్లోకి రావాలనే నిర్ణయం తీసుకున్న తర్వాత, గంగాధర్ తన ఆటోను వదిలేసి, పూర్తిగా వార్డు అభివృద్ధికి అంకితమయ్యారు. నాలుగైదు సంవత్సరాలుగా సొంత పనులు వదిలేసి, ప్రజల వైపు మొగ్గు చూపారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి, చిన్నది.. పెద్దది అనకుండా సమస్యలు విని, అధికారులతో సమన్వయం చేసి పరిష్కరించారు. ఈ త్యాగం ఆయనను 'ఆపద్బాంధవుడు'గా పేరు తెచ్చిపెట్టింది. 2020లో టీఆర్ఎస్ తరఫున ఎస్సీ సీటుపై విజయం సాధించి, వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఆయన, ఇప్పుడు మున్సిపాల్ ఎన్నికల సందర్భంగా జనరల్ సీటుపై పోటీ చేయడానికి ప్రజల మద్దతు కోరుతున్నారు. ఆయన ప్రయాణం, సాధారణ మనిషి రాజకీయాల్లో ఎలా మార్పు తెచ్చుకోగలడో చూపే సజీవ ఉదాహరణ.

## అభివృద్ధి సాధనలు-వార్డును మార్చిన కీలక ప్రాజెక్టులు

కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో గంగాధర్ వార్డు అభివృద్ధికి చేసిన కృషి అపారం. ఆయన ఆధ్వర్యంలో.. రూ.60 లక్షల రూపాయలతో 11 సీసీ రోడ్లను నిర్మించారు. ఇవి వార్డు లోపలి ప్రాంతాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచాయి. అంతేకాకుండా, రూ.25 లక్షలతో 12 డ్రైనేజీలను నిర్మించడంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను తగ్గించాయి. రూ.1 కోటి 43 లక్షల రూపాయలు కేటాయింపజేసుకుని 'బస్తీ దవాఖాన' నిర్మాణం జరిగేలా కృషి చేశారు. వైద్య సేవలను బలోపేతం చేశారు, దీంతో స్థానికులు సులభంగా వైద్య సహాయం పొందుతున్నారు. అదే క్రమంలో తనను గెలిపించిన ప్రజల్లో భాగమైన 'బేడ బుడగజం' ఫంక్షన్ హాల్‌కు రూ.10 లక్షలు, ముస్లింల కోసం షాదీఖానాకు మరో రూ.10 లక్షలు, హనుమాన్ దేవాలయాలకు రూ.10 లక్షలు కేటాయించుకునేలా కృషి చేసి, సామాజిక, మత సామరస్యాన్ని పెంపొందించారు. అత్యవసర డ్రైనేజీకి రూ.5 లక్షలు, మండల పరిషత్ స్కూలుకు రూ.10 లక్షలు వెచ్చించి, విద్యా, ఆరోగ్య రంగాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచారు. ఈ ప్రాజెక్టులు వార్డు ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతీకరించాయి, ఆయన సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అదే క్రమంలో అంతర్గత రోడ్లు మాత్రమే కాదు.. విద్యుత్ సమస్యలు.. తాగునీటి అవసరాలు.. వంటి ఎన్నో మౌలిక సదుపాయాల కల్పన విషయంలో గంగాధర్ 'రాజీ లేని పోరాటం' చేశారనడంలో అతిశయోక్తికాదు.



## భవిష్యత్ లక్ష్యాలు-ప్రజల మద్దతుతో మరిన్ని మార్పులు

అర్ధరాత్రి తలుపుతట్టి తనకీ ఆపదొచ్చిందని వేడుకోవడం ఆలస్యం.. వెంటనే తన వెహికిల్‌లోనే 'ఆపద' వద్దకు వెళ్లి పరిష్కారం అయ్యేదాకా పక్కనే ఉంటూ 'మనోధైర్యం' నింపే మంచి మనిషిగా గుర్తింపు పొందాడాయన. కాగా.. ఇప్పుడు వచ్చిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గంగాధర్ మరోసారి ప్రజల్లోకి వెళ్లనున్నారు. గతంలో చేసిన సేవలు, అభివృద్ధి పనులు ఆయనకు బలమైన మద్దతును తెచ్చిపెట్టాయి. సాధారణ మనిషి దృక్కోణంతో పని చేస్తూ, వార్డును మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఆయన, ప్రజల అవసరాలను మనస్ఫూర్తిగా అర్థం చేసుకుని సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రయాణం, కష్టపడి పైకి వచ్చిన వ్యక్తి సమాజానికి ఎలా తిరిగి ఇవ్వగలడో చూపే మానవీయ కథ.!



### దగ్గరుండి చూసుకునే వాడు



వైద్య పరంగా ఏ ఒక్కరికి సమస్య వచ్చినా.. హైదరబాద్, కరీంనగర్ వంటి పెద్ద హస్పిటల్స్‌కి స్వయంగా వచ్చి ట్రీట్‌మెంట్ అందే వరకు. దగ్గర ఉండి చూపించేవారు. ఏరియా బస్తీ దవాఖాన కోసం ఎంతో కృషి చేశారు.

- చిత్తారి గంగాధర్



### ఎండాకాలం తాగునీటి కొరత తీర్చాడు



ఎండకాలంలో నీటి కోరత ఏర్పడినప్పుడు మున్సిపల్ వాటర్ కోసం కృషి చేసారు. కొన్ని సందర్భంలో తానే స్వయంగా ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకోని వచ్చేవారు. స్ట్రీట్ లైట్ ఎక్కడ రాకున్న వెంటనే స్పందించి మరమ్మతులు చేపించేవారు. ఎంత అర్ధరాత్రి అయిన ఫోన్ చేయగానే వచ్చి సమస్య తెలుసుకొని తీర్చేవారు.

- పిట్ట రాధమ్మ



### 15 ఏళ్ల కలను నెరవేర్చారు

15 ఏళ్ల నుంచి నెరవేరని కలైన మా ఫంక్షన్ హాలును ఆయన కౌన్సిలర్ గెలవగానే నిధులు సమకూర్చి ఫంక్షన్ హాల్ కట్టించి కలని నెరవేర్చారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం నిరంతరం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి ఇప్పించే వారు.

- నూనె వంశీ



# జగిత్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం



- పోరండ్ల వద్ద పార్టీ ముగించుకుని తిరిగి వస్తుండగా ఘటన
- విద్యుత్ స్తంభం, డివైడర్‌కు ఢీకొని కారు బోల్తా
- నవనీత్, సాయి తేజ ఘటన స్థలంలోనే మృతి
- సృజన్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు
- జగిత్యాలలో విషాద వాతావరణం.. యువత నిర్లక్ష్యంపై ఆందోళన





**నేటి సాక్షి, జగిత్యాల బ్యూరో (రాధారపు నర్సయ్య):** తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి గత వారం రోజులుగా 'అరైవ్-అలైవ్ అని రోడ్డు ప్రమాదాలపై రాష్ట్రవ్యాప్తంగా నెత్తీనోరూ మొత్తుకుని చెబుతున్నా ప్రజలు పోలీసుల జాగ్రత్తలను పెడచెవిన పెట్టి యథావిధిగా ప్రాణాలు పోగొట్టుకుంటూనే ఉన్నారు. జగిత్యాల జిల్లాలో సంక్రాంతి సెలవుల సందర్భంగా స్వగ్రామాలకు వచ్చిన ముగ్గురు యువకులు మద్యం మత్తు, అతివేగంతో కారు నడిపి ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటాక పోరండ్ల ప్రాంతంలో జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ఘటన స్థలంలోనే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద ఘటనతో జగిత్యాల పట్టణంలో విషాద వాతావరణం నెలకొంది.

## పోరండ్లలో పార్టీ.. తిరుగు ప్రయాణంలో..

జగిత్యాలకు చెందిన చిలువేరి నవనీత్, ఎర్రం సాయి తేజ, ధరూర్‌కు చెందిన సృజన్ అనే ముగ్గురు యువకులు సంక్రాంతి సెలవులను జరుపుకోవడానికి స్వగ్రామాలకు వచ్చారు. స్నేహితులతో కలిసి జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల ప్రాంతంలో పార్టీ ముగించుకుని, అర్ధరాత్రి దాటాక 'టిఎస్ 02 ఎఫ్.హెచ్.7258 అనే నెంబర్ గల కారులో తిరిగి ప్రయాణం చేస్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపినందువల్ల అదుపు తప్పి ముందుగా విద్యుత్ స్తంభానికి ఢీకొని, ఆ తర్వాత రోడ్డు మధ్యలోని డివైడర్‌ను తీవ్రంగా తాకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలకు గురయ్యారు.

## దర్యాప్తు ప్రారంభం.. యువతకు హెచ్చరిక

సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదానికి అతివేగం, మద్యం మత్తు, యువకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పరిస్థితులపై వివరంగా దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో జగిత్యాల పట్టణంలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లోనూ తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. సంక్రాంతి వంటి సంతోషకరమైన సమయంలో ఇలాంటి విషాదాలు జరగకుండా యువత జాగ్రత్తగా వాహనాలు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని స్థానికులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ఘటన స్థలంలోనే ఇద్దరు మృతి

స్థానికులు, పోలీసుల సాయంతో గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే, నవనీత్, సాయి తేజలు చికిత్స పొందుతూ ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో యువకుడు సృజన్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

# తాంబూలాలు ఇచ్చేశారు..!

## కోరుట్ల మున్సిపల్ ఎన్నికలకు వార్డు రిజర్వేషన్ జాబితా ఖరారు

- మహిళలు, బీసీలకు అధిక కేటాయింపులు..
- పట్టణ రాజకీయాల్లో హడావిడి మొదలు
- మొత్తం 33 వార్డులకు జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు ఖరారు
- మహిళలకు 13 వార్డులు.. బీసీలకు 9 వార్డులు.. ఎస్సీలకు 3.. ఎస్టీలకు 1
- అభ్యర్థుల ఎంపికపై పార్టీల్లో చర్చలు.. కొత్త ముఖాలకు అవకాశం
- ఎన్నికల సమీకరణలు మారే అవకాశం.. రాజకీయ విశ్లేషకుల ఊహాగానాలు







**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

కోరుట్ల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అధికారులు 33 వార్డుల వార్డు రిజర్వేషన్ జాబితాను ఖరారు చేశారు. జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలతో పాటు మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్‌లు కేటాయించగా, పట్టణ రాజకీయాల్లో హడావిడి మొదలైంది. మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. మొత్తం 13 వార్డులు మహిళలకు, 9 బీసీలకు, 3 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించగా, పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక, సమీకరణలపై చర్చలు ప్రారంభమయ్యాయి.

రిజర్వేషన్ ఖరారు.. రాజకీయ హడావిడి షురూ

కోరుట్ల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అధికారులు కీలకమైన వార్డు రిజర్వేషన్ జాబితాను ఖరారు చేశారు. ఈ జాబితా విడుదలతో పట్టణ రాజకీయాల్లో తీవ్ర హడావిడి మొదలైంది. ముఖ్యంగా మహిళలు, బీసీ (బ్యాక్‌వర్డ్ క్లాస్), ఎస్సీ (షెడ్యూల్డ్ కాస్ట్), ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. మొత్తం 33 వార్డులకు గాను జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలతో పాటు మహిళలకు రిజర్వేషన్ ఖరారు చేశారు. రిజర్వేషన్ ఖరారుతో అభ్యర్థుల ఎంపిక, రాజకీయ సమీకరణలు, కూటములపై పార్టీల్లో అంతర్గత చర్చలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా మహిళలకు అధికంగా కేటాయింపులు ఉండటంతో కొత్త ముఖాలకు అవకాశం దక్కే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ జాబితా విడుదల ఎన్నికల ముందుగా పార్టీల్లో ఆంతరిక ఒడిదుడుకులకు దారితీసింది.

## వివరణాత్మక రిజర్వేషన్ జాబితా ఇదే.!

ఖరారైన కోరుట్ల మున్సిపల్ వార్డు రిజర్వేషన్ వివరాలు ఇలా ఉన్నాయి: 1వ వార్డు-జనరల్ (మహిళ), 2వ వార్డు-బీసీ (మహిళ), 3వ వార్డు-ఎస్సీ, 4వ వార్డు-ఎస్సీ (మహిళ), 5వ వార్డు-జనరల్ (మహిళ), 6వ వార్డు-జనరల్ (మహిళ), 7వ వార్డు-ఎస్టీ, 8వ వార్డు-జనరల్, 9వ వార్డు-జనరల్ (మహిళ), 10వ వార్డు-జనరల్ (మహిళ), 11వ వార్డు-జనరల్, 12వ వార్డు-బీసీ, 13వ వార్డు-బీసీ (మహిళ), 14వ వార్డు-బీసీ (మహిళ), 15వ వార్డు-బీసీ, 16వ వార్డు-ఎస్సీ, 17వ వార్డు-బీసీ, 18వ వార్డు-జనరల్, 19వ వార్డు-జనరల్, 20వ వార్డు-జనరల్, 21వ వార్డు - బీసీ (మహిళ), 22వ వార్డు-జనరల్ (మహిళ), 23వ వార్డు-జనరల్, 24వ వార్డు-జనరల్ (మహిళ), 25వ వార్డు-బీసీ (మహిళ), 26వ వార్డు-జనరల్ (మహిళ), 27వ వార్డు-బీసీ, 28వ వార్డు-బీసీ, 29వ వార్డు-జనరల్ (మహిళ), 30వ వార్డు-జనరల్, 31వ వార్డు-బీసీ, 32వ వార్డు-జనరల్, 33వ వార్డు-బీసీ (మహిళ). ఈ రిజర్వేషన్‌తో మహిళలకు మొత్తం 13 వార్డులు (జనరల్, ఇతర కేటగిరీల్లో), బీసీలకు 9 వార్డులు, ఎస్సీలకు 3 వార్డులు, ఎస్టీలకు 1 వార్డు కేటాయించబడ్డాయి. ఈ మార్పులు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని, పార్టీలు తమ వ్యూహాలను పునఃస్థాపించుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

